ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


పెనుమూడి వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ


మీ-సేవలు.. లేవు

- కేంద్రాల్లో నిలిచిన ప్రభుత్వ సేవలు
- 15 రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు
- వివిధ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇక్కట్లు
- ఎన్‌వోసీలపై జాప్యం చేస్తున్న సర్వీసు ప్రొవైడర్లు

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మీ-సేవ కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు గత కొద్ది రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందకపోతుండ టంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ముఖ్యంగా విద్యార్థులు ఇక్కట్లకు గురౌతున్నారు. ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో వివిధ సర్టిఫికెట్లను అప్‌లోడింగ్ చేయాల్సి ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొంటే అక్కడి నుంచి వీఆర్‌వో, ఆర్‌ఐ, తహసీల్దార్, ఆర్‌డీవో లాగిన్‌ల వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నది. దీంతో పుణ్యకాలం పూర్తి అవుతున్నది. విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని పరిస్థితి ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 230 వరకు మీ-సేవ కేంద్రాలున్నాయి. వీటికి ఏపీఆన్‌లైన్, రామ్ ఇన్ఫో, సీఎంఎస్‌లు సర్వీసు ప్రొవైడర్లుగా ఉన్నారు. అయితే ఈ మూడు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు పడినట్లు తెలిసింది. దీంతో రెండు వారాల క్రితం ప్రభుత్వం మీ-సేవా కేంద్రాలకు సర్వీసులను నిలిపేసింది. ఆయా సంస్థలు జిల్లా కలెక్టర్ల వద్దకు వెళ్లి ప్రభుత్వానికి బకాయిలు ఏమి లేనట్లుగా ఎన్‌వోసీలు తెచ్చుకొంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని చెప్పింది. అయితే ఆయా సంస్థలు ఎన్‌వోసీలు తెచ్చుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఈ కారణంగా మీ-సేవా కేంద్రాల్లో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున రోజుకు 300 నుంచి 400 వరకు సర్వీసులను ప్రజలు వినియోగించుకొంటుంటారు. విద్యుత్, ఆస్తి, నీటి పన్నులు, ఆర్‌టీఏ, రిజిస్ట్రేషన్, రెవెన్యూ తదితర సేవల కోసం వీటికే ఎక్కువగా వెళుతుంటారు. అక్కడ సర్వీసు ఛార్జీలు చెల్లించుకొని నిర్ణీత తేదీకి సర్టిఫికెట్లను కేంద్రాల నిర్వాహకులు అందజేస్తుంటారు. కులధ్రువీకరణ, నివాస, ఆదాయం వంటి సర్టిఫికెట్లను అడ్మిషన్ల సమయంలో విద్యా సంస్థలు కోరుతుంటాయి. దాంతో అందరూ మీ-సేవ కేంద్రాల వైపే చూస్తుంటారు. ఒకసారి కులధ్రువీకరణ పత్రం ఇచ్చిన తర్వాత మళ్లీ తాజాగా తీసుకురావాలని కోరవద్దని ప్రభుత్వం ఆదేశించినా వివిధ శాఖలు వాటిని బేఖాతరు చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు తాజాగా కుల ధ్రువీకరణ పత్రం తీసుకురమ్మని ఆ జ్ఞాపిస్తున్నాయి. అయితే ఈ సందర్భంగా విద్యార్థుల అవసరాన్ని సొమ్ము చేసుకొనేందుకు కొంత మంది రెవెన్యూ ఉద్యోగులు మైగ్రేషన్ సర్టిఫికేట్ తీసుకురావాలని చెబుతున్నారు. ఆ సర్టిఫికేట్ తెచ్చుకోలేక దళారులను ఆశ్రయించి రూ. 5 వేలు సమర్పించుకొన్న తర్వాత కుల ధ్రువీకరణ పత్రం వారి చేతికి అందుతున్నది. కాగా మీ-సేవ కేంద్రాల వలన రోజుకు రూ. కోటి వరకు ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుంటుంది. గత 15 రోజులుగా నిలిచిపోవడం వలన ఆ మేరకు ప్రభుత్వానికి నష్టం జరిగింది. దీని దృష్ట్యా తక్షణమే సర్వీసులు పునరుద్ధరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

తీరం.. అప్రమత్తం


- మూడు రోజులుగా వర్షం
- బ్యారేజి నుంచి దిగువకు నీటి విడుదల
- ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన అధికారులు
- వీడని వర్షాలతో వెద పెట్టిన వరికి కొంత మేర నష్టం

బాపట్ల(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి టౌన్, రేపల్లె, గుంటూరు సిటీ, జూలై 20: అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తుపాను ఒడిస్సా వైపునకు వెళ్లడంతో శనివారం మధ్యాహ్నం వరకు ఓ మోస్తరు వర్షం పడింది. కృష్ణానది పరీవాహక ప్రాంతంతో పాటు ఎగువన భారీగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ జలకళను సంతరించుకుంటోంది. నదిపై శ్రీశైలం జలాశయానికి ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండుకుండల్లా మారడంతో గేట్లు ఎత్తారు. దీంతో దిగువకు కృష్ణమ్మ పరుగులు పెడుతూ వస్తోంది. ఇదే సమయంలో వర్షాలు కూడా విస్తారంగా కురుస్తున్నాయి. అదే సమయంలో పట్టిసీమ నుంచి కూడా గోదావరి జలాలు వస్తుండడంతో ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తింది. దీంతో నాలుగు గేట్లు తెరిచి నీటిని కిందకు వదిలారు. ఈ పరిస్థితుల్లో బ్యారేజికి దిగువన ఉన్న తీర ప్రాంతప్రజలతో పాటు బాపట్ల జిల్లాలోని తీరప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో తొలిసారిగా ప్రకాశం బ్యారేజి దిగువకు వరద నీటిని అధికారులు శనివారం విడుదల చేశారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల ధాటికి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కట్టలేరు, కీసర, తదితర వాగుల నుంచి 7100 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతున్నట్లు నీటి పారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగుల నీటి మట్టం నమోదు అవుతుండగా 8 గేట్లను ఒక అడుగుమేర ఎత్తి 5800 క్యూసెక్కుల నీరు దిగువకు వదులు తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు 1300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు. వర్షం కోసం ఎదురు చూసిన రైతులు ప్రస్తుతం కురుస్తోన్న వర్షాలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని మండలాల్లో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లోని పంటలకు ఈ వానలు మేలే అన్న మాట వినిపిస్తోంది. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు కూడా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. తెరిపిస్తే అన్ని రకాల పంటలు సాగు చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. పల్లపు ప్రాంతాల్లో వెద పెట్టిన వరికి కొంత మేర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో సగటున 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

రేపల్లె వద్ద పొలాల్లో నిలిచిన వర్షపునీరు


బాపట్ల ఎస్పీ డూడీ పరిశీలన..

రేపల్లె మండలం పెనుమూడి వంతెన వద్ద కృష్ణానది ప్రవాహాన్ని బాపట్ల ఎస్పీ తుషార్‌డూడీ శనివారం పరిశీలించారు. అల్పపీడన ప్రభావం మరో రెండు రోజులు ఉండనుందనే వాతావరణ శాఖ సంకేతాల దృష్ట్యా విధుల్లో నిర్లక్ష్యం ఉండరాదని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోకి ముంపు ప్రాంత ప్రజలు వెళ్లాలని, తక్షణ సహాయం కొరకు 100కు డయల్ చేయాలని తెలిపారు. రేపల్లె డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మట్లాడుతూ కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా సేవలకు పోలీసులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కె.నజీర్‌బేగ్, తదితరులు ఉన్నారు.


ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు



మిర్చి మాంద్యం

- నెలలుగా పెరగని ధర
- బోర్డు తిప్పేస్తున్న వ్యాపారులు
- ఆర్థికంగా చితికిపోతున్న రైతులు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- ఇటీవల పదిమందికి పైగా వ్యాపారులు అదృశ్యం
- న్యాయం చేయలేని స్థితిలో గుంటూరు మార్కెట్ కమిటీ
- మార్కెటింగ్ చట్టాన్ని సవరించకపోతే రైతుల మెడకు ఉరే

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మిర్చి.. ఎర్ర బంగారం లావాదేవాల్లో నెల కొన్న మాంద్యం రైతులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. కమీషన్, ఎగుమతి వ్యాపారులు అప్పు తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసి నెలల తరబడి ఎదురు చూస్తున్నా మార్కెట్‌లో ధర ఏమాత్రం పెరగడం లేదు. దీంతో అప్పులు పెరిగిపోయి వ్యాపారులు బోర్డు తిప్పేస్తున్నారు. రైతులకు చెల్లించాల్సిన బాకీలు చూస్తే రూ.కోట్లలో ఉంటే తమ వద్ద ఆస్తులు రూ.లక్షల్లోనే ఉన్నాయని, వాటిని విక్రయించి సర్దుబాటు చేయాలని ఇన్‌సాల్వెన్స్ పిటీషన్(ఐపీ)లు దాఖలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో 10 మందికి పైగా వ్యాపారులు ఇలా అదృశ్యం కావడంతో రైతులు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సరుకు విక్రయానికి తీసుకురావాలంటేనే భయపడిపోతున్నారు. ఏ రోజున ఏ వ్యాపారి అదృశ్యం అన్న వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మిర్చి విస్తీర్ణం పెరగడంతో దిగుబడి భారీగా వచ్చింది. మరోవైపు చైనా, బంగ్లాదేశ్, సింగపూర్, మలేషియా, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో ఈ సంవత్సరం మిర్చి సీజన్‌లోనే మాంద్యం నెలకొన్నది. అయితే మార్కెట్ పెరుగుతుందన్న ఆశతో కమీషన్ వ్యాపారులు, ఎగుమతిదారులు అప్పులు తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేశారు. అయితే రైతులకు పూర్తిస్థాయిలో నగదు చెల్లించకుండా 50 శాతం ఇచ్చి మిగతాది సరుకు అమ్మగానే ఇస్తామని చెప్పి కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ పెట్టారు.

• రైతులకు రూ.కోట్లలో బకాయిలు

ఇటీవల గురజాలకు చెందిన ఓ వ్యాపారం రూ.10 కోట్ల మేరకు రైతులకు బకాయిలు ఎగ్గొట్టింది. భవాని చిల్లీస్ ట్రేడింగ్ అనే సంస్థ అయితే దాదాపుగా రూ.50 కోట్ల మేరకు బకాయి పడిందని రైతులు చెబుతున్నారు. ఇదేవిధంగా కనకయ్య, జీరో రామయ్య, యాగ్రోక్రాఫ్స్, టీ వెంకటేశ్వరరావు, జేఎండీ, జేఎంజే, విజయకృష్ణ ట్రేడర్స్, వీఎన్ఆర్ ట్రేడర్స్ నాగిరెడ్డి, వరుణ్ ఎక్స్‌పోర్ట్స్ నిర్వాహకులు రైతులకు పెద్దమొత్తం లోనే బకాయి పడ్డారు. రైతులు వారి చుట్టూ తిరిగి తాము మోసపోయామని ప్రతీ సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో జరిగే పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌కు వచ్చి తమ గోడును వెళ్లబోసుకుంటూ న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.2 వేలకు పైగా తగ్గిన ధర

ఈ సంవత్సరం మార్చితో పోల్చి చూస్తే మిర్చి ధరలు పతనమయ్యాయి. క్వింటాల్‌కు రూ.2 వేల వరకు తగ్గింది. గుంటూరు మిర్చియార్డుకు ఎక్కువగా ఆర్మూరు, తేజ, 334, విత్తన రకాలు, సింజెంటా బ్యాడిగి వంటివి వస్తాయి. అలానే తాలుకాయలు కూడా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతాయి. సీజన్‌కు ముందు నాణ్యతని బట్టి తేజ వెరైటీ ధర క్వింటాల్ రూ.22 వేల వరకు ఉన్నది. నేడు రూ.18 వేల లోపే ధర లభిస్తున్నది. తాలుకాయలకు అయితే క్వింటాల్‌కు రూ.6 వేలు కూడా రావడం లేదు. ఒకప్పుడు సింజెంటా బ్యాడిగి క్వింటాల్ రూ. 30 వేలకు పైగా ధర ఉంటే నేడు రూ.13 వేలకే లభిస్తున్నది. ఈ కారణంగా క్రెడిట్ తీసుకొచ్చి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేసిన వారు నిలదొక్కుకోలేని పరిస్థితి నెలకొన్నది.

వైసీపీ సానుభూతిపరులతో నిండిపోయిన అసోసియేషన్

గుంటూరు మిర్చియార్డులో కమీషన్ వ్యాపారుల అసోసియేషన్ అంతా వైసీపీకి కొమ్ముకాసే సామాజిక వర్గీయులతో నిండిపోయి ఉన్నది. దీంతో అసోసియేషన్‌ని ఆశ్రయించినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోతున్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నా కమీషన్, ఎగుమతి వ్యాపారులు మోసం చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితి. కేవలం నామమాత్రంగానే బ్యాంకు గ్యారెంటీలు మార్కెట్ కమిటీ వద్ద ఉంటాయి. అవి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల లోపే ఉంటాయి. ఈ మొత్తం కూడా మార్కెట్ కమిటీకి అద్దె, ఫీజు ఎగ్గొడితే రికవరీ చేసుకోవడానికి మాత్రమే. రైతులకు దీని నుంచి పరిహారం ఇప్పించలేని పరిస్థితి. మార్కెట్ కమిటీ ఎంత సేపటికీ మార్కెట్ ఫీజు వసూలు చేసుకోవడం పైనే దృష్టి పెడుతుంది తప్ప వ్యాపారులు చేస్తున్న లావాదేవీలను క్రమబద్ధీకరించడం లేదు. ఇది కూడా వ్యాపారులు బోర్డు తిప్పేయడానికి కారణమౌతున్నది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ చట్టంలో సవరణలు చేయడంతో పాటు ఎవరికి పడితే వారికి కమీషన్, ఎక్స్‌పోర్టు లైసెన్సులు ఇవ్వకుండా నియంత్రించే విధంగా చర్యలు చేపట్టకపోతే మిర్చి రైతుల మెడకు ఉరితాళ్లు తప్పేలా లేవు.


భార్గవ్ తేజ (గుంటూరు జేసీ)


ధనుంజయ్ (పల్నాడు జేసీ)


నవీన్ (సీఆర్‌డీఏ అదనపు కమిషనర్)


దినేష్‌కుమార్ (గుంటూరు కమిషనర్)

బదిలీలు.. నియామకాలు

గుంటూరు, నరసరావుపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఒకరు బదిలీ కాగా నలుగురికి పోస్టింగ్‌లు దక్కాయి. గతంలో జరిగిన బదిలీల్లో గుంటూరు, పల్నాడు జేసీలు ఉద్యోగోన్నతిపై కలెక్టర్లుగా వెళ్లారు. ఈ క్రమంలో అప్పటి నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శనివారం జరిగిన బదిలీల్లో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా అమిలినేని భార్గవ్‌తేజ, పల్నాడు జాయింట్ కలెక్టర్‌గా గనోర్ సూరజ్ ధనుంజయ్ నియమితులయ్యారు. 2018 సివిల్స్ బ్యాచ్‌కు చెందిన భార్గవ్‌తేజ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆయన సర్వీసుని మున్సిపల్ పరిపాలన శాఖ నుంచి ఉపసంహరించి గుంటూరు జేసీగా నియమిస్తూ ఉత్త ర్వులు వెలువరించింది. అనంతపురం జిల్లా కనగాని పల్లె మండలంలోని సోమరవాండ్లపల్లెకు చెందిన భార్గవ తేజ తొలిసారి ఇండియన్ రైల్వేకి, రెండో సారి ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్‌కి ఎంపికయ్యారు. రెవెన్యూ సర్వీసులో శిక్షణలో ఉండగానే మూడో ప్రయత్నంలో అఖిల భారత స్థాయిలో 88వ ర్యాంకు సాధించారు. భార్గవ్‌తేజ కొంతకాలం తూర్పు గోదావరి జిల్లాలో హౌసింగ్ జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు.

పల్నాడుకు రెండో జాయింట్ కలెక్టర్‌గా..

పల్నాడు జిల్లాకు రెండో జాయింట్ కలెక్టర్‌గా గనోర్ సూరజ్ ధనుంజయ్ నియమితులయ్యారు. రామచంద్రాపురం గిరిజన సంక్షేమ ప్రాజెక్టు అధికారిగా ఉన్న ధనుంజయ్ తాజా బదిలీల్లో పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ధనుంజయ్ 2018 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. పల్నాడు జేసీగా ఉన్న శ్యాంప్రసాద్ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా ఈ నెల 2న బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. సోమవారం ధనుంజయ్ బాధ్యతలు స్వీకరిస్తారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా నవీన్

ఏపీసీఆర్‌డీఏ అదనపు కమిషనర్‌గా ఎం. నవీన్ నియమితులయ్యారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నవీన్ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా జేసీగా ఉన్నారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మికి నవీన్ భర్త అవుతారు.

ఏపీ ట్రాన్స్‌కోకు గుంటూరు కమిషనర్ కీర్తి

గుంటూరు (కార్పొరేషన్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఇక్కడకు రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న కొత్తమాసు దినేష్ కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా బదిలీ చేసింది. 2017 ఐఏఎస్ బ్యాచ్‌లో దినేష్‌కుమార్ ఆరో ర్యాంకు సాధించారు. విజయవాడకు చెందిన ఆయన తొలి పోస్టింగ్‌లో తెనాలి సబ్ కలెక్టర్‌గా పని చేశారు. అక్కడి నుంచి బదిలీపై నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమి షనర్‌గా ఆ తర్వాత సత్య సాయి జిల్లా జేసీగా ఒక రోజు, ఆ తర్వాత రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా చేశారు. 2022 ఏప్రిల్ నుంచి కమిషనర్‌గా విధుల్లో ఉన్న దినేష్‌కుమార్‌ని తాజా బదిలీల్లో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభు త్వం నియమించింది. ఇక గుంటూరు కమిషనర్‌గా ఉన్న కీర్తిని విజయవా డలోని ఏపీ ట్రా న్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

నిధుల రాబట్టేందుకు బాధ్యతలు

- ఎంపీల భేటీలో చంద్రబాబు నిర్ణయం

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు సీఎం చంద్రబాబు మంత్రులు, ఎంపీలను కేంద్ర మంత్రులకు మ్యాపింగ్ చేశారు. శనివారం సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కూటమి ఎంపీల సమావేశంలో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మంత్రి లోకేశ్‌ను సమన్వయం చేసుకుని కార్పొరేట్ వ్యవహారాలకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి ప్లానింగ్ శాఖకు సంబంధించి కేంద్ర మంత్రి రావు ఇంద్రజీత్‌సింగ్, రాష్ట్ర మంత్రి ఫరూక్‌తో కలిసి మైనార్టీ వ్యవహారాలపై కేంద్ర మంత్రి కిరణ్‌రిజీజుతో చర్చించి నిధులు రాబడతారు. బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణితో సమన్వయం చేసుకుని గిరిజన శాఖకు సంబంధించి కేంద్ర మంత్రి ఓరం, రాష్ట్ర మంత్రి ఫరూక్‌తో సమన్వయం చేసుకుని లా అండ్ జస్టిస్‌కు సంబంధించి కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్‌తో, రాష్ట్ర మంత్రి బాలవీరాంజనేయ స్వామితో కలిసి కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్‌కు నివేదించి నిధులు మంజూరుకు కృషి చేస్తారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో సమన్వయం చేసుకుని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని తరచుగా కలుస్తారు. కమ్యూనికేషన్ల అంశాలను మంత్రి లోకేశ్ ద్వారా కేంద్ర మంత్రి పెమ్మసాని తెలుసుకుని నిధుల మంజూరు కోసం కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు నివేదిస్తారు. ఈ విధంగా రాష్ట్ర మంత్రులు, ఎన్‌డీఏ ఎంపీలను కేంద్ర మంత్రులతో మ్యాపింగ్ చేశారు.

జీజీహెచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న పెమ్మసాని, పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు


- అసంపూర్తి భవనాలపై నివేదిక ఇవ్వండి
- రోగులకు తగిన సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని వ్యాఖ్యలు
- గంటకు పైగా జీజీహెచ్‌పైనే సమీక్ష

7లో..



నరకాసుర వధకై సమరం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. శనివారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోలీసాఫీసర్‌గా ఆయన క్రౌర్యాన్ని పలికించిన తీరు ఆకట్టుకుంది. సూర్య పాత్రను నరకాసురుడితో పోల్చుతూ, అతన్ని ఎదుర్కోవడానికి వస్తున్న హీరో హీరోయిన్ల పాత్రలను శ్రీకృష్ణుడు, సత్యభామతో పోల్చిచూపడం ఆసక్తిని పెంచింది. ఆగస్టు 29న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: మురళీ జీ, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్

మాస్టర్స్ పట్టా అందుకున్న అనా కొణిదెల

స్నాతకోత్సవానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆమెకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో శనివారం వైభవంగా జరిగిన స్నాతకోత్సవంలో ఆమె పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానంలో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి వెళ్లిన పవన్.. మాస్టర్స్ పట్టా పొందిన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్‌లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికి తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే ఆమె మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి



మాస్టర్స్ డిగ్రీ సాధించారు. కాగా, పవన్ దంపతులు సింగపూర్ నుంచి నేడు విజయవాడ రానున్నారు.

- అమరావతి, (ఆంధ్రజ్యోతి)

కమిటీ కుర్రోళ్లు వస్తున్నారు



గ్రామీణ నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, శ్రావ్య, విషిక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా నిహారికా కొణిదెల మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై వస్తున్న తొలి చిత్రమిది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహితులతో సెలబ్రేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంద'ని చెప్పారు.

ఆగస్టు నుంచి ఆరంభం



'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిజైనర్ నీరజ్ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. హైదరాబాద్‌లో 30 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: జ్ఞానశేఖర్ వీ.ఎస్, సంగీతం: థమన్ ఎస్.ఎస్.

కల్కి బృందానికి నోటీసులు



'కల్కి 2898 ఏ.డీ' మేకర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాలో నటించిన ప్రభాస్, అమితాబ్ బచ్చన్, ఇతర నటులతో పాటు మేకర్స్‌కు మాజీ కాంగ్రెస్ నాయకుడు, కల్కి ధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రసాద్ లీగల్ నోటీసులు పంపారు. "ఈ సినిమా భారతీయ ఇతిహాసాల్లోని విశ్వాసాలను దెబ్బతీసేలా ఉంది. ఇందులో హిందూ పురాణాల్లో ఉన్న విధంగా కాకుండా.. వాటిని వక్రీకరించారు. విష్ణుమూర్తి చివరి అవతారం 'కల్కి'ని పవిత్ర గ్రంథాలను కించపరిచేలా చిత్రీకరించారు. ఇది దేశంలో కోట్లాది సంఖ్యలో ఉన్న భక్తులను అయోమయానికి, గందరగోళానికి గురిచేసేలా ఉంది" అని ఆచార్య ప్రసాద్ ఈ నోటీసులో ఆరోపించారు.

ఆకట్టుకునే చిన్న కథ



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందకిషోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్నాడు. హీరో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రంలో విశ్వదేవ్ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ప్రసాద్ అనే మధ్యతరగతి తండ్రి పాత్రలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. ఇది చిన్న కథ కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని మేకర్స్ తెలిపారు. వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: టి.సి ప్రసన్న

మహిళలు మెచ్చిన పేకమేడలు



వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేకమేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా అన్ని చోట్లా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం శనివారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "భావోద్వేగంతో నిండిన మంచి సినిమాను తీశారని చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారు" అని అన్నారు. "మంచి కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి రుజువు చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఇలాంటి మరిన్ని సినిమాలు నిర్మించడానికి ఉత్సాహం ఇచ్చింది" అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.

ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్



సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ చక్కగా ఉంది. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు. "ఫీల్‌గుడ్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత పారమళ్ల లింగయ్య అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కొడగంటి వీక్షితవేణు, కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.



పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న నీటి సంఘాల ప్రతినిధులు, పక్కన ఎమ్మెల్యే నసీర్

కృష్ణానది యాజమాన్య బోర్డును విజయవాడలోనే ఏర్పాటుచేయాలి

- పెమ్మసానికి నీటి సంఘాల ప్రతినిధుల విజ్ఞాపన

గుంటూరు(తూర్పు), జూలై 20: వైసీపీ ప్రభుత్వంలో అనాలోచితంగా విశాఖపట్నంలో కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)ను ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు రాష్ట్ర జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ మాజీ సభ్యులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు విజయవాడలోనే కేఆర్ఎంబి కార్యాలయం ఏర్పాటుచేయడానికి 2015లో ఇబ్రహీంపట్నంలో భవనాలను పరిశీలించారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా 2020 జూన్, ఆగస్టులలో ఆ కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటుచేయాలని అప్పటి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాసిందని గుర్తుచేశారు. దీనికి విరుద్ధంగా 2020 డిసెంబరులో కేఆర్ఎంబి కార్యాలయాన్ని కృష్ణా బేసిన్ దాటి విశాఖపట్నంలో ఏర్పాటుచేయాలని గత ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకోవటం చాలా దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి విజయవాడలోనే కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా పెమ్మసాని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసినవారిలో నీటి సంఘాల ప్రతినిధులు మైనేని మురళీకృష్ణ, యనమద్ది పుల్లయ్యచౌదరి, గుండపనేని శ్రీనివాసరావు, కట్టా కోటయ్య, అంకాళ్ళ ప్రభుదాసు, తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- అసంపూర్తి భవనాలపై నివేదిక ఇవ్వండి
- రోగులకు తగిన సౌకర్యాలు కల్పించకపోతే చర్యలు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని వ్యాఖ్యలు
- గంటకుపైగా జీజీహెచ్‌పైనే సమీక్ష

గుంటూరు(తూర్పు), జూలై 20: జీజీహెచ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. శనివారం, కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి జీజీహెచ్, రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌పై గత సమావేశంలో చర్చించిన అంశాల వారీగా సమీక్షించారు. అధికారులను ఉద్దేశించి పెమ్మసాని మాట్లాడుతూ జీజీహెచ్‌లో రెండో సీటీస్కాన్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలన్నారు. ఫిర్యాదుల స్వీకరణ కోసం ప్రత్యేకబాక్సును, డాక్టర్ల పేర్లు, అందుబాటులో ఉండే సమయం వివరాల పట్టికను ఏర్పాటుచేయాలన్నారు. పలు విభాగాల్లో ఏసీల కొనుగోలుకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సమీకరణకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. రోగుల రద్దీ ఎక్కువగా ఉన్న విభాగాల్లో స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకువచ్చే వైద్యుల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎంపీ లాండ్స్ నిధులతో నిర్మిస్తున్న రోగుల సహాయకుల వెయిటింగ్‌హాల్ పెండింగ్ పనుల నిర్మాణానికి అధికధరలు కాంట్రాక్ట్ ఇవ్వటంపై విజిలెన్స్ విచారణకు అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం పోలీస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగుల నియామకం, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పెమ్మసాని మాట్లాడుతూ జిల్లాలో ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, పెండింగ్ పనులపై రైల్వే అధికారులు వివరాలు అందిస్తే రైల్వేశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. భూసేకరణకు సంబంధించిన సర్వే వివరాలు సిద్ధం చేయాలన్నారు. బుర్రిపాలెం రైల్వేట్రాకు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలో జాతీయరహదారికి అనుసంధానమైన రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు అందిస్తే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వేట్రాకు కింద నుంచి వెళుతున్న నగరపాలక సంస్థ మెండివాగు డ్రైయిన్ విస్తరణకు రైల్వే అధికారులు ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ సందర్భంగా కంతేరు వద్ద ఆర్‌యూబీలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నందివెలుగు రోడ్డులోని ఆర్వోబీ పెండింగ్ పనులు పూర్తిచేయాలని, ఇటీవల నూతనంగా నిర్మించిన రోడ్లు పాడైపోయాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి ఎమ్మెల్యేలు తెచ్చారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.టీటీకే రెడ్డి, సీపీఓ శేషశ్రీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, ఈఈ సమర్పణరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, సీఎస్ఆర్ఎంఓ డా.బీబీ సతీష్‌కుమార్, జేడీ చిన్నం సుధారాణి పాల్గొన్నారు.జీజీహెచ్, ఆర్అండ్‌బీ, రైల్వే, వ్యవసాయం అంశాలపై రెండుగంటలపాటు సమీక్ష నిర్వహించాలని తొలుత పెమ్మసాని నిర్ణయించారు. సమయాభావం వల్ల జిల్లా వ్యవసాయంపై మరోసారి సమీక్ష చేస్తానని చెప్పారు.



జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న పెమ్మసాని, పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

రాజకీయాల్లో జాగ్రత్త లేకుంటే ఇబ్బందులు పడతారు

- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 20: రాజకీయాలలో ఎవరైనా జాగ్రత్తగా వుండాలని లేకపోతే ఇబ్బందులు పడతారని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ, అవమానాలు ఎదుర్కొని ఏ రీతిగా తిరిగి నిలబడాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని చూసి ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని అన్నారు. 2019లో చంద్రబాబునాయుడుకి రిటర్న్ గిఫ్ట్ ఇచ్చాం అని చెప్పుకున్న వాళ్లకు 2023లో తెలంగాణలో రేవంత్‌రెడ్డి ఊహించని రీతిలో రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారన్నారు. యరపతినేని ప్రసంగిస్తున్నంత సేపు రేవంత్‌రెడ్డి చిరునవ్వులు చిందిస్తూ పలుమార్లు సభికులకు అభివాదం చేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం నుంచి నేటి రాజకీయాల వరకు పలు సామాజిక వర్గాలకు చెందిన యువకులు ఈ స్థాయిలో వున్నారంటే ఆ ఘనత స్వర్గీయ ఎన్‌టిఆర్‌దేనన్నారు. 28 ఏళ్ల వయసుకే 1994లో తాను మొదటిసారి పోటీచేసి గెలిచానని తెలిపారు. తనలాంటి వారెందరికో కులాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత అన్న నందమూరి తారకరామారావుదే అన్నారు. ఎన్‌టిఆర్ వల్లనే అనేకమంది కేంద్ర మంత్రులుగా, ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా అవకాశాలను అందిపుచ్చుకున్నారని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. తాను ఏడుసార్లు ఒకే నియోజకవర్గం నుంచి పోటీ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నేటి రాజకీయాలలో వున్నవారు పరస్పరం గౌరవించలేని వ్యక్తులు కొందరు వున్నారని యరపతినేని అన్నారు. కులాలకు అతీతంగా అన్నివర్గాలను గౌరవించే, వ్యక్తిత్వం వున్న కులం కమ్మకులమన్నారు. ముందుగా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. యరపతినేని అనంతరం మాట్లాడిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గురజాల ఎమ్మెల్యే యరపతినేని నాకు మంచి మిత్రుడు సన్నిహితుడని అన్నారు. యరపతినేని శ్రీనివాసరావుతో వున్న అనుబంధాన్ని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రాంతాలకు అతీతంగా కమ్మ సామాజికవర్గం నన్ను ఎంత అభిమానిస్తుందో ఆయన మాటల్లో స్పష్టమవుతుంది. నన్ను అన్ని విధాల ఆదరించిన వారి ప్రేమాభిమానాలు మర్చిపోలేను....అంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ఎస్ఆర్ఎంలో సైన్స్ అవగాహనా సదస్సు

మంగళగిరి సిటీ, జూలై 20: మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నానో జాతర పేరిట శనివారం ప్రత్యేక సైన్స్ అవగాహనా సదస్సు జరిగింది. బెంగుళూరుకు చెందిన నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్స్ కేంద్రం, ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ప్రధానంగా విద్యార్థులకు నానో సైన్స్ రంగాల్లో వస్తున్న మార్పులు, జరుగుతున్న అభివృద్ధి, వాటి ప్రయోజనాలను వివరించే లక్ష్యంతో ఈ నానో జాతరను ఏర్పాటు చేశారు. నానో అండ్ సాఫ్ట్ మేటర్ సెంటర్ డైరెక్టర్ బివిఎల్ ప్రసాద్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో క్విజ్ పోటీలను నిర్వహించగా, విజయవాడకు చెందిన మేరీ స్టెల్లా, ఆంధ్రా లయోలా, కేబీఎన్ కళాశాలల విద్యార్థులు మొదటి మూడు స్థానాలను దక్కించుకున్నారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన వివిధ కళాశాలల నుంచి 300 మంది విద్యార్థులు, అధ్యాపకులు నానో జాతరకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డీన్ డాక్టర్ సీవీ టామీ, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ప్రసాద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్ఆర్ఎం ప్రతినిధులు

రాష్ట్రంలో శవం కన్పిస్తే జగన్‌లోని సైకో నిద్ర లేస్తాడు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూలై 20: రాష్ట్రంలో శవం కన్పిస్తే చాలు జగన్‌రెడ్డిలోని సైకో మళ్ళీమళ్ళీ నిద్ర లేస్తాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. కానీ ఆయన జిమ్మిక్కులు, శవ రాజకీయాల్లోనే.. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన విషయాన్ని జగన్ గుర్తు పెట్టుకోవాలన్నారు. జగన్ వికృత మనస్తత్వం గుర్తించే వైనాట్ 175 అని విర్రవీగిన వ్యక్తిని ఎన్నికల్లో ప్రజలు 151 నుంచి 11కు తెచ్చినా బుద్ధి రాలేదన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన హత్యోదంతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయ పబ్బం గడుపుకోవాలని జగన్‌రెడ్డి పడుతున్న అవస్థలు చూస్తుంటే అసహ్యం కలుగుతోందన్నారు. ఐదేళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఎక్కడికి వెళ్ళి ఏం మాట్లాడాలనే కనీస విచక్షణ కూడా జగన్‌రెడ్డి కోల్పోయినట్టు కన్పిస్తుందన్నారు. బిడ్డపోయిన బాధలో ఉన్నవారికి పరామర్శలో రాజకీయ ప్రసంగాలు, అమ్మఒడి, ఇతర పథకాల ప్రస్తావన ఎందుకో సమాధానం చెప్పాలన్నారు. అన్నింటికీ మించి జగన్ పెంచిపోషించిన హత్యా రాజకీయాలతోనే ఇన్ని హత్యలు, దాడులు జరుగుతున్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. తన రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఐదేళ్లపాటు యువతకు గంజాయి, కత్తులు అందించిన జగన్ పాపాలకు ఫలితమే ఇప్పుడు ఎన్నో ప్రాణాలు పోతున్నాయనేది చేదు నిజం అని వాపోయారు. ఇంత జరుగుతున్నా బాధితులకు ఊరట కంటే విద్వేషాలు ఎగదోయటమే లక్ష్యంగా జగన్ శవయాత్రలు సాగిస్తున్నారన్నారు. దానికి ముందుగా తన అనుకూల మీడియా తప్పుడు పోస్టులతో ప్రజల మధ్య, వర్గాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇవన్నీ చూస్తుంటే కోర్టు విచారణల నుంచి, అసెంబ్లీ సమావేశాల నుంచి తప్పించుకోవటానికే జగన్ దొంగ నాటకాలు ఆడుతున్నట్టు కన్పిస్తుందన్నారు. నెల రోజుల్లోనే ఏదో జరిగిపోయిందని గావు కేకలు పెడుతూ ప్రధానికి లేఖ రాసి ఢిల్లీలో దీక్ష చేస్తున్నాను అంటున్న జగన్ తన ఐదేళ్ల రక్తచరిత్రపై కూడా ప్రధానికి మరో సవివరమైన లేఖ రాయాలని ప్రత్తిపాటి సూచించారు.

యోగాతో నాడీ రుగ్మతలను అధిగమించాలి

- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ సూచన
- ఘనంగా ప్రారంభమైన 'ఏపీ న్యూరోకాన్'

గుంటూరు (మెడికల్), జూలై 20: నేటి ఒత్తిళ్లతో కూడిన సమాజంలో నరాలు, నాడీ సంబంధ రుగ్మతల బారినుంచి ప్రజలకు నివారణ కల్పించేందుకు యోగా, మెడిటేషన్ వంటివి ఎంతగానో తోడ్పతాయని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. శనివారం ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని శ్రీకన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎన్ఎస్ఏ) 31వ వార్షిక సదస్సు ఏపీ న్యూరోకాన్ 2024లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. తొలుత ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో పాటు ఏపీ ఎన్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పీ విజయ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. పీజీఐ, చండీఘర్ డైరెక్టర్, న్యూరో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ వివేక్‌లాల్ మాట్లాడుతూ కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా రోగుల వైద్యచికిత్సల్లో వైద్యుడు తన మేధస్సును వాడాలని, కేవలం యాంత్రికంగా వైద్య పరిజ్ఞానంపై ఆధారపడటం తగదని సూచించారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బాబ్జీ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సులో సీనియర్ వైద్యులు తమ అనుభవం రంగరించి చేసే ప్రసంగాలు, కేసు స్టడీలు యువవైద్యులకు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేబాశిష్‌చౌదరి, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్ సూర్య, డాక్టర్ మానస్ పాణిగ్రాహి, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీఆర్ తారక్‌నాథ్, సెక్రటరీ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ ఎన్‌వీ సుందరాచారి తదితరులు ప్రసంగించారు. అనంతరం సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జాగర్లమూడి మురళీకృష్ణ శర్మ, న్యూరోసర్జన్ డాక్టర్ బీ దిబ్బల్‌రావులకు జీవిత సాఫల్య అవార్డులు అందజేశారు. దిబ్బల్‌రావు సభకు రాలేకపోవడంతో ఆయన తరఫున ప్రొఫెసర్ మల్లేశ్వరరావు అవార్డు అందుకున్నారు. అనంతరం జరిగిన సైంటిఫిక్ సెషన్‌లో పలువురు ప్రముఖ వైద్యులు వివిధ అంశాలపై ప్రసంగించారు. మెడికల్ పీజీ విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ నిర్వహించారు. ఆదివారం కూడా సదస్సు కొనసాగుతుంది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ విజయ తదితరులు

మహనీయులను స్మరించుకున్న వీసీ

పెదకాకాని, జూలై 20: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు శనివారం పలువురు మహనీయులను స్మరించుకున్నారు. యూనివర్సిటీ మెయిన్ గేటు వద్ద ఆచార్య నాగార్జున విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అక్కడి నుంచి జాతిపిత మహాత్మా గాంధీ, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలకు కూడా వీసీ పూలమాలలు వేశారు. మహనీయుల త్యాగాలతో దేశ ప్రతిష్ట ఇనుమడించిందన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నాంది పలకాలని సూచించారు. వీసీ వెంట ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సంధ్య కోల్, ప్రిన్సిపాల్స్ స్వరూపరాణి, సిద్దయ్య, జాన్సన్, ప్రమీలారాణి, శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, వెంకటేశ్వర్లు, సింహాచలం, మధుబాబు, అశోక్‌కుమార్, త్రిమూర్తిరావు, మల్లికార్జున, చెన్నారెడ్డి, పూర్ణచంద్రరావు, సోమశేఖర్, వికాస అధ్యక్ష కార్యదర్శులు టి.అనిల్‌కుమార్, కావూరి శ్రీనివాసరావు, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రాము, టీఎన్టీయూసీ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వి.విష్ణుప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు, డైలీ వేజ్ నాయకులు నంబూరు సాంబయ్య, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



దిగువ సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న సమీరా నజీర్

నృసింహుని దర్శించుకున్న గవర్నర్ సతీమణి

మంగళగిరి, జూలై 20: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సతీమణి సమీరానజీర్ శనివారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువసన్నిధిలో దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద పూజల అనంతరం శ్రీలక్ష్మీ నృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



పవన్ కల్యాణ్ (ఫైల్‌ఫోటో)

మాచర్లటౌన్, జూలై 20: కడుపునొప్పి తాళలేక ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. అనంతపురం జిల్లా, పుట్లూరు మండలం, చాలవేముల గ్రామానికి చెందిన దొడ్డి పవన్ కల్యాణ్ (24) మాచర్ల మండలంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ట్రిపుల్ ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పట్టణంలోని ఆర్‌సీఎం స్కూల్ సమీపంలో ఓ గృహంలో అద్దెకు ఉంటున్నాడు. పవన్ కల్యాణ్ తమ్ముడు రాజేంద్ర అదే ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతూ కళాశాల హాస్టల్‌లో ఉంటున్నాడు. రాత్రి సమయంలో మాచర్ల పట్టణానికి వచ్చిన రాజేంద్ర తన అన్న పవన్‌కల్యాణ్‌కు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదు. దీంతో పవన్‌కల్యాణ్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు చేరుకొని తలుపు తీసిచూడగా పవన్ కల్యాణ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా ఉండడాన్ని గుర్తించాడు. ఈ మేరకు తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించాడు. పట్టణ పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127,138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00



ఉద్యోగావకాశాలు

- గుంటూరు సిటీలోని ప్రముఖ స్వీట్ షాప్ నందు పనిచేయుటకు అనుభవం గల యువతి యువకులు కావలెను. సంప్రః 98661 32826, 94411 21025. AJG-191761
- THE CARRIER'S GUIDE నందు పనిచేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ కావలెను. Q : ఇంటర్, డిగ్రీ, సంప్రః 70135 08653. AJG-191763
- ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో ASO/ Consultant గా పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, 10th పాసైన 30 సం.లు నుండి 68 సం.లు వయస్సు కలిగిన గృహిణులు, రిటైర్ అయిన అభ్యర్థులు కావలెను. ఫోన్ నెం: 98486 47051, 90591 50774. AJG-191764
- అమెరికాలో చిన్న పిల్లలను స్కూలుకు తయారు చేసి ఇంటి పనులు చూసుకొనుటకు అనుభవమున్న వీసా కలిగిన మంచి పనివారు కావలెను. వివరములకు 9346441024, 9000852679. RK-1260
- Computer Operator Vacancy Only For Girls working in XL Sheets and MS Office, LV Scientific, Gorantla, Guntur. Cont : 9030949299, 8919345584. AJG-184623
- బాపట్ల జిల్లా భట్టిప్రోలు దగ్గర కనగాల వద్ద సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం. డ్యూటీ భోజన వసతి, ఒంటరి & రిటైర్డ్ ఎంప్లాయిస్‌కు చక్కని అవకాశం. సంప్ర: 96423 13999, 92472 71222. AJB-294

పెయింగ్ గెస్ట్

- పెయింగ్ గెస్ట్ : 68 సంవత్సరాల వృద్ధునకు సంరక్షణగా చూసుకొనుటకు పెయింగ్ గెస్ట్ కావలెను. సంప్రదించండి సెల్ : 7569879199 AJG-191767

రియల్ ఎస్టేట్

- గుంటూరు, బెజవాడ, Hyd, మంగళగిరి, కాజా, పెదకాకాని, గోరంట్ల, లాం, GPR, జనచైతన్య రామకృష్ణ OK సిటీ మెగా సిటీ, రాజధాని ప్లాట్స్, పొలాలు అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్రః 86390 01165, 98494 73838. AJG-191460
- అమరావతి రాజధాని పరిధిలో లింగాయపాలెం, చావపాడు, కంతేరు, లాం, పెద్దపరిమి ప్రాంతాలలో CRDA అప్రూవ్డ్ & నాన్ అప్రూవ్డ్ ప్లాట్లు అతి తక్కువ ధరకే స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. రేట్లు పెరగకముందే త్వరపడండి సంప్రః 88863 55955, 88868 55355. AJG-184775
- గుంటూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి అంకిరెడ్డి పాలెం ఊరులో తక్షణమే ఇల్లు కట్టుకొనుటకు ఉపయోగపడే ప్లాట్లు కొరకు సంప్రదించండి : 99591 27008. AJG-191755
- గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, పెనిగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్రః జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ఫోన్ : 73823 96677 SAAA-763
- గుంటూరు, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, ఇన్నర్ రింగ్‌రోడ్, అమరావతి రాజధాని పరిధిలో పొలములు, ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించగలరు. కె. రాజా. 9169446789. SAAA-762
- AP రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్రదించగలరు. (నో మీడియేటర్స్) ✆ 81429 75999. AJB-194779
- AP రాజధాని అమరావతి మరియు విజయవాడ పరిసర ప్రాంతాలలో 100 అడుగుల రోడ్డును ఆనుకొని లే అవుట్లో ఇన్‌స్టాల్‌మెంట్లో ప్లాట్లు, అపార్టుమెంట్లు డెవలప్‌మెంట్ స్థలాలు, పొలాలు కొరకు సంప్ర: 95819 99555. AJB-194521

స్థలం అమ్మకము

- బాపట్ల జిల్లా దైవాలరావూరు గ్రామం (మేదరమెట్ల దగ్గర) ఎ.19.0 సెం. వ్యవసాయ భూమి అమ్మబడును. సం.నం. 9989157441/ 9908862323 AJH-001997

PLOT FOR SALE

- రాజధాని గుంటూరు, విజయవాడలో 15 వెంచర్లలో CRDA ప్లాట్స్ పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు, ఫామ్ ల్యాండ్స్ మీకు అందుబాటు ధరలలో కలవు. సెల్ : 9390451999 AJO-183943
- హైదరాబాద్ హయత్‌నగర్, కుంట్లూరు, పసుమాముల, గౌరెల్లి, తారామతి పేట్, పెద్ద అంబర్ పేట, అబ్దుల్లాపూర్, పోచంపల్లి శ్రీమిత్ర, కోహెడల్లో ప్లాట్లు కొనబడును. సెల్ : 9391125860/ 9866288866 AJH-002431

బిల్డింగ్ అమ్మకము

- విష్ణునగర్ 3వ లైను (విద్యానగర్ 1/7) 5 అంతస్తుల బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ప్రతి ఫ్లోర్‌లో 2 బెడ్ రూమ్ ఫ్లాట్ కలదు. మొత్తంగా / విడివిడిగా అమ్మకముకు కలదు. సంప్రః 97041 39333, 98857 00115. AJG-191766

FLAT FOR SALE

- బ్రాడీపేట 6/19లో రెయిన్‌బో రీచ్ ల్యాండ్ అపార్ట్‌మెంట్ నందు 3BHK 1800 sft. నార్త్, ఈస్ట్ ఫేసింగ్, ఫుల్లీ ఫినిష్డ్ మొత్తం 10 ఫ్లాట్లు కొద్ది ఫ్లాటు మాత్రమే కలవు. గృహ ప్రవేశనమునకు సిద్ధంగా ఉన్నవి. సంప్రః 97041 39333, 98857 00115. AJG-191765
- మిథున ఎన్‌క్లేవ్ సొసైటీ కాలనీ, E/F, W/F ఫ్లాట్స్ 1800 చ॥అ॥ 4 ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ఇన్నర్ రింగ్ రోడ్డుకి దగ్గర, గుంటూరు. రెడీ టు ఆక్యుపై. సంప్రః 9989488410. AAA-9494
- గుంటూరు, విద్యానగర్ 3/10వ లైన్‌లో శ్రీభార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 2800 చ॥అ॥ల 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యూపై. సంప్రః 79894 56509, 95427 57575. AAA-9243
- గుంటూరు, కొరిటిపాడు సాయిబాబా రోడ్, 4వ లైన్‌లో శ్రీభార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 1150 2BHK & 1660 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యూపై. సంప్రః 79894 56509, 95427 57575. AAA-9242
- గుంటూరు, ఇన్నర్ రింగ్‌రోడ్డు భగత్‌సింగ్ బొమ్మ దగ్గరలో రెడీ టూ అక్యుపై 3BHK-2400 Sft, 2BHK-1150 sft, ఫుల్లీ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకం. సంప్రః 9490960449. AA-890


అద్దెకు

- గుంటూరు, బ్రాడీపేట 6/19 సత్య క్లాసిక్ అపార్ట్‌మెంట్ నందు 1st ఫ్లోర్‌లో ఫ్లాట్ నెం : 101 తూర్పు ఫేసింగ్‌తో 3BHK అన్ని వసతులతో అద్దెకు ఇవ్వబడును. సంప్రదించండి సెల్ నెం : 97422 58945. AJG-191756
- గుంటూరు, శ్యామలనగర్, 3వ లైన్ X టెన్షన్, బాల కుటీర్ స్కూల్ దగ్గర ఇండిపెండెంట్ హౌస్, 1st ఫ్లోర్, ఈస్ట్ ఫేస్ 2 B/R అన్ని వసతులతో అద్దెకు ఇవ్వబడును. సంప్రః 77021 23808. AJG-191471
- గుంటూరు, బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో అమరావతి ఫుడ్ కోర్టు పైన 2వ ఫ్లోర్‌లోని షాపు వ్యాపారములకు అద్దెకు ఇవ్వబడును. సంప్రః 7036430653, 7993564165. AJG-191503
- Sri Padmavathi Sreeinvasa Nilayam, Opp : Municipal Park, Brodipet, 6/12, Cross Gr. Floor 2 BHK house prefer : Brahmins with car park. Cell : 9972291711 AJG - 191497
- గోరంట్ల, అన్నపూర్ణ నగర్, 5వ లైన్‌లో ఉన్న 3 అంతస్తుల బిల్డింగ్ శ్రీ లక్ష్మీ హేమ నిలయం ఆఫీసులకు అద్దెకు కలదు. సంప్రః 9848354719 AJG-191760
- గుంటూరు, అరండల్‌పేట, 13/2వ లైనులో ఫ్యామిలీ పోర్షన్ అద్దెకు ఇవ్వబడును. Cont : 94934 45394, 9866391117 (Call before 2.00 PM & After 5.00 PM). AJG-191491
- 100% వాస్తుతో 1640 చ.అ. 3BHK ఫ్లాట్ అద్దెకు ఇవ్వబడును. లిఫ్ట్ సౌకర్యం కలదు. గుంటూరు, కొత్తపేట, హోండా సర్వీస్ స్టేషన్ ఎదురు, పెద పోస్టాఫీసురోడ్, సాయినాథ్ టవర్స్ నందు సంప్రః 93976 04669. NAM-138

లీకేజీ సమస్యలా?

- బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజీపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్రః 9642458892 AJG-191759

అద్దెకు ఇవ్వబడును



గుంటూరులో జి.టి.రోడ్డు, రమేష్ హాస్పిటల్ వెనుక 26,500 చ॥ అడుగుల కమర్షియల్ 5 అంతస్తుల నూతన భవనం సెల్లార్ పార్కింగ్. 2 స్టెచర్ లిఫ్టులు బిల్డింగ్‌కు 2 వైపుల రోడ్డు, అన్ని సౌకర్యములతో హాస్పిటల్‌కు మరియు కమర్షియల్ ఆఫీసులకు బిల్డింగ్ అద్దెకు ఇవ్వబడును.

✆ 98661 32826

చెదల నివారణ

- చెదపురుగులు, బొద్దింకల నివారణ 5 సం॥ గ్యారంటీ. AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాన్సర్ పెస్ట్ కంట్రోల్, పట్నం బజార్, గుంటూరు. ఫోన్ : 8978672824, 9848131213 SAAA-774

బిల్డింగ్ డిమాలిష్

- పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగలకొట్టబడును మరియు పాత కలప, ఐరన్ రేకులు, సిమెంట్ రేకులు కొనబడును. ఫోన్ : 9849481424, 80746 77449. AJG-191502

బోర్ వెల్స్

- విజయ బోర్ వెల్స్ : 4-1/2, 6-1/2; 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. సంప్రః హరిహర మహల్ ఎదురుగా L.V.R. క్లబ్ ప్రక్కన, గుంటూరు. సంప్రః 98662 22717, 98481 83887. AAA-9484

మ్యారేజ్ లింక్స్

- మీ అబ్బాయికి / అమ్మాయికి పెళ్ళి సంబంధం కావాలా? Govt., Pvt. Officers, Civils, IIT, IIM, Doctors, Engineers. Degree. www.sweethomemarriage.in. Cont.: 9849072372 AJV-183445

పోయినవి

- కొమ్మనబోయిన రాధా కృష్ణమూర్తి S/o. కోటయ్య, డోర్ నెంబరు : 1-47/1, నారికేళ్ళపల్లి గ్రామం, చుందురు మండలము, బాపట్ల జిల్లా, నా యొక్క ఒరిజినల్ పొలం దస్తావేజులు డాక్యుమెంట్ నెంబరు 2430/2011, 21-07-2011 న తీసుకొని చేబ్రోలు రిజిస్టారు ఆఫీసు నుండి చుందూరు మండల ఆఫీసుకు పోవుచుండగా ఆటో దిగి చూడగా ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ నెంబరుకు తెలియజేయగలరు 7288995382. AJG-191383

EDUCATION

- Join B.Sc Comp / Ele M.Com Cmp, BA Ec/ Hi / Sp. Eng, M.Com, MA Eng, MSW, Apply Scholarships, PLNM Degree College, Cont: 9177408565. AJG-191762
- ఓపెన్ 10th, ఇంటర్ మరియు B.A, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA లకు ఉత్తమ శిక్షణ ఇవ్వబడును. సంప్రః శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801. NAM-93
- లాంగ్ టర్మ్ కోచింగ్ ఫర్ EAPCET-2025 (AP&TS), అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన. హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801. NAM-136

HEALTH

- సత్తెనపల్లిలోని విజయ శారద హాస్పిటల్ (ఎండి జనరల్ మెడిసిన్ డయాబెటాలజీ) నందు ప్రతి ఆదివారం ఉచిత OP చూడబడును. ఫోన్ : 93474 82409, 733 856 9612 AJG-191026

జ్యోతిష్యాలము

- హస్తసాముద్రికము (హ్యాండ్-రీడింగ్) ప్రశ్నా జాతకము - గృహ వాస్తు నాకు సాధ్యమైన వరకు చెప్పగలను. అప్పికట్ల వెంకటేశ్వరరావు సిద్ధాంతి, చినరావూరు పార్కు వద్ద, తెనాలి, సెల్ : 9441452404 AJG-191199

శ్రీబగళాముఖి ఆలయాన్ని దర్శించుకున్న బాపట్ల జిల్లా జడ్జి



శ్రీబగళాముఖి ఆలయాన్ని దర్శించుకున్న బాపట్ల జిల్లా జడ్జి, కుటుంబ సభ్యులు

పిట్టలవానిపాలెం, జూలై 20 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మ వారి ఆలయానికి బాపట్ల జిల్లా జడ్జి కేపీ బాలాజి వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్ర పరివారంతో శనివారం అమ్మవారి ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. జిల్లా జడ్జి బాలాజి పుట్టిన రోజు సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి వారిని ఆహ్వానించి శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయ విశేషాలను, చరిత్రలను వివరించారు. దేవస్థానం తరుపున వేదపండితులచే ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : జేసీ



సచివాలయంలో సేవల పనితీరును పరిశీలిస్తున్న జేసీ సుబ్బారావు

కర్లపాలెం, జూలై 20 : సచివాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోకుండా వారికి సకాలంలో మెరుగైన సేవలందించాలని బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు అన్నారు. మండలంలోని పాతనందాయపాలెం గ్రామసచివాలయాన్ని శనివారం తహసీల్దార్ నిర్మలానందబాబాతో కలిసి ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కుంచాల గోపిరెడ్డి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ బృందం పర్యటన



నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న కౌన్సిల్ బృందం

బాపట్ల, జూలై 20 : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ బృందం శనివారం సందర్శించింది. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ గౌరవవందనాన్ని స్వీకరించారు. కళాశాల యాజమాన్యం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ బృందానికి డాక్టర్ వైదేహి విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. నాక్‌బృందం కళాశాలలోని అన్ని విభాగాలను, మౌలికసదుపాయాలను పరిశీలించారు. పూర్వవిద్యార్థినీలు, తల్లిదండ్రులు, కళాశాల విద్యార్థినులు అధ్యాపకులతో చర్చించి వారి సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. బృందం నివేదికను కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేశాయి. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కె.హరిపద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్ళూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

భావదేవుని దర్శించుకున్న కలెక్టర్ వెంకటమురళీ



శ్రీ భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రదక్షిణ చేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ

బాపట్ల, జూలై 20 : బాపట్ల పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీ మత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణ స్వామి దేవాలయాన్ని కలెక్టర్ జె.వెంకటమురళీ శనివారం సందర్శించారు. దేవాలయ విశిష్టత గురించి తెలుసుకున్న ఆయన ఆలయంలో ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ సిబ్బంది, పండితులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు



రిలయన్స్ మార్ట్‌లో తనిఖీలు చేస్తున్న లీగల్ మెట్రాలజి జాయింట్ కంట్రోల్ రీజనల్ అధికారులు

బాపట్ల, జూలై 20 : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు లీగల్ మెట్రాలజి అధికారులు బాపట్లలో శనివారం తనిఖీలు నిర్వహించారు. రీజనల్ హెడ్ ఎం.మాధురి, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఈబి విలియమ్స్, లీగల్ మెట్రాలజి జిల్లా కంట్రోలర్ కె.ఇస్సాకు, అసిస్టెంట్ కంట్రోల్ పి.లిల్లీ, ఏపీఎస్‌సిఎస్‌సి లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ బి.రామదాసు, డీసీఐసీ కన్వీనర్ దాసరి ఇమానియేలు సంయుక్తంగా బాపట్ల మార్కెట్ దగ్గర ఉన్న రిలయన్స్ మార్ట్‌ను తనిఖీ చేశారు. అనంతరం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ప్రత్యేక కౌంటర్ ద్వారా లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు విక్రయించాలని వారు ఆదేశించారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం

పిట్టలవానిపాలెం, జూలై 20 : పిట్టలవానిపాలెం తహసీల్దార్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన తహసీల్దార్ కె.స్ఫూర్తి శనివారం బదిలీపై వెళుతున్న సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఆమెను పూలమాలతో, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆవులకు వ్యాధినిరోధక టీకాలు

బాపట్ల, జూలై 20 : తెల్లపశువులలో వచ్చు ముద్ద చర్మవ్యాధి నిరోధకటీకాల కార్యక్రమాన్ని శనివారం మహర్షి ఆశ్రమగోశాలలో ప్రారంభించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పశువులను పరిశీలించి టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని పశువైద్యశాలలు, రైతుసేవా కేంద్రాలలో టీకాలు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయసంచాలకులు డాక్టర్ టి.శంకరరావు, వెదుళ్ళపల్లి పశువైద్యాధికారి డాక్టర్ బి.గోపికృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రీసూక్త హోమం

బాపట్ల, జూలై 20 : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం జిల్లెళ్ళమూడి అమ్మవారి సన్నిధిలో ఆదివారం ఆషాడ శుద్ధ పౌర్ణమి, గురుపౌర్ణమి, వ్యాసపౌర్ణమి పురస్కరించుకొని 108 ఆవృతుల శ్రీసూక్తహోమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, కలశస్థాపన జరుగుతుందన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యసేవలందించాలి

● బాపట్ల ఏరియా వైద్యశాలను తనిఖీ చేసిన కలెక్టర్



వార్డులో రోగుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళీ

బాపట్ల, జూలై 20 : ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ జె.వెంకటమురళీ అన్నారు. బాపట్ల ఏరియా వైద్యశాలను శనివారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగుల పేర్ల నమోదు, ఓపీ, ఇంజక్షన్ చేసే గది, హెచ్ఐవి కౌన్సిల్‌గదులు, ఎక్స్‌రే, స్కానింగ్ గదులు, చిన్నపిల్లల వార్డు, కాన్పులు, ప్రసూతివిభాగాలను పరిశీలించి ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యం సక్రమంగా జరుగుతుందా, డాక్టర్‌లు బాగా చూస్తున్నారా, సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయా లేదా వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా అంటూ రోగులతో మాట్లాడుతూనే ఆరా తీశారు. ఆసుపత్రిలో బెడ్‌ల సామర్థ్యం, ప్రతిరోజు సగటున నమోదైౖ ఓపీలు, వైద్యం కొరకు ఆసుపత్రిలో చేరుతున్న వారి సంఖ్య, అత్యవసర విభాగంలో సేవలు, ఆపరేషన్‌లు జరుగుతున్న తీరు, ఔషదాల నిల్వలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రోగుల వెంట వచ్చే బంధువులు వేచి ఉండటానికి ఎలాంటి సౌకర్యం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఆసుపత్రి పరిధిలో ఉన్న నిధుల వివరాలు అడిగి తెలుసుకొని సెమిటెంపరరీ షెడ్ ఏర్పాటు చేయటానికి కృషి చేస్తామన్నారు. అవసరమైతే దాతల సహకారం తీసుకుంటామని చెప్పారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సహజంగా వైద్యశాలలపై రోగులు అసంతృప్తిగా మాట్లాడుతుంటారని ఇక్కడ చక్కగా వైద్యం అందుతున్నట్లు తెలిపారన్నారు. దీనిపట్ల తనకు సంతృప్తిగా ఉందన్నారు. ఎక్కడైనా 10 నుంచి 20 శాతం అసంతృప్తి ఉంటుందని ఇక్కడ ఆవిధంగా లేదన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలపై నిరంతరం వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. రక్తనిల్వలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. 20 పడకల స్పెషల్ న్యూబోర్న్‌ను కేర్ యూనిట్ జిల్లాలో సమర్థంగా నడుస్తుందన్నారు. అప్పుడే పుట్టిన శిశువులు అనారోగ్యానికి గురైతే ప్రత్యేక యూనిట్‌లో వైద్యం అందిస్తున్నామన్నారు. వర్షాల సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బాపట్లలోని ప్రాంతీయ వైద్యశాలలో 400లకు పైగా ఓపీలు నమోదు అవుతున్నాయని చెప్పారు. 7 విభాగాలలో ఓపీలు నడుస్తుండగా అత్యవసర సేవలు, ఆపరేషన్‌ల కొరకు సగటున రోజుకు 4 నుంచి 5 వరకు బ్లడ్‌ప్యాకెట్‌లు వినియోగిస్తున్నట్లు తెలిపారు. బ్లడ్ స్టోరేజి విభాగంలో 49 ప్యాకెట్‌లు ఉన్నాయని వాటి సామర్థ్యాన్ని ఇంకా పెంచాలని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఏరియావైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దార్థ, ఏపీవీపీ కోఆర్డినేటర్ డాక్టర్ శేషకుమార్‌తదితరులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం వాటర్ ప్లాంట్‌లు నిర్వహించాలి : ఏఈ

కర్లపాలెం, జూలై 20 : కర్లపాలెం మండలంలో వాటర్‌ప్లాంట్‌ను నిర్వహిస్తూ మంచినీటిని విక్రయాలు జరుపుతున్న నిర్వాహకులు నిబంధనలను పాటించాలని, నాణ్యమైన తాగునీటిని మాత్రమే ప్రజలకు అందించాలని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ దిలీప్‌కుమార్ అన్నారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని పోలీసుస్టేషన్ ఎదురు ఉన్న వాటర్‌ప్లాంట్, శ్రీపెద్దింటమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న వాటర్‌ప్లాంట్, ఎంవిరాజుపాలెంలో ఉన్న వాటర్‌ప్లాంట్‌లను ఏఈ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావులతో కలిసి శనివారం సందర్శించారు. వాటర్ ప్లాంట్ నిర్వహణపై నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. వాటర్‌ప్లాంట్‌లో విక్రయిస్తున్న మంచినీటిని ల్యాబ్‌లకు పంపించి టెస్ట్ చేయిస్తామని ఏఈ తెలిపారు. నిబంధనలు పాటించకుండా ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించకపోతే ప్లాంట్‌పై చర్యలు చేపడుతామని ఏఈ నిర్వాహకులను హెచ్చరించారు. వీరి వెంట కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

తాగునీటితో నిండిన కంకటపాలెం తాగునీటి చెరువు

బాపట్లరూరల్, జూలై 20 : బాపట్ల మండలం 'కంకటపాలెంలో తాగునీటికి కటకట' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడగా స్పందించిన అధికారులు గ్రామంలో తాగునీటి చెరువును నీటితో నింపారు. చెరువులో తాగునీరు అయిపోవటంతో సుమారు 10 రోజులకు పైగా గ్రామంలోని ప్రజలకు వాటర్ ట్యాంకర్‌ల ద్వారా నీటిని అధికారులు అందించారు. ఇప్పుడు చెరువు తాగునీటితో నిండుగా ఉండటంతో గ్రామంలోని ప్రజలకు వాటర్‌ట్యాప్‌ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలకు న్యాక్ గుర్తింపు

బాపట్లరూరల్, జూలై 20 : బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలోని మాతృశ్రీ ఓరియంటల్ కళాశాలకు న్యాక్ బి++ గ్రేడ్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నదానం హనుమత్తు ప్రసాద్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలలో న్యాక్ గుర్తింపు పొందిన ఏకైక ఓరియంటల్ కళాశాల మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ ట్రస్టీ గిరిధర్‌కుమార్, కరస్పాండెంట్ గోగినేని రాఘవేంద్రరావు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షణసైన్యం వ్యవస్థాపక దినోత్సవం

బాపట్ల, జూలై 20 : ఆంధ్రప్రదేశ్‌లో రక్షణసైన్యం సంస్థను స్థాపించిన రోజును పురస్కరించుకొని శనివారం బాపట్ల విద్యానగర్ చర్చి ప్రాంగణంలో పతాకావిష్కరణ చేశారు. సంఘపెద్దలు, గృహసమితి స్త్రీలు, యూత్ పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి డీసీ గేరా థామస్, సీయోను కుమారిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బాపట్ల డివిజన్ పరిధిలో 34 సంఘాలలో విద్య, వైద్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కాగిత వరప్రసాదరావు, జీవి.మణిభూషణ్, తుమాటి విజయ్‌కుమార్, బోడా సమీర్ చంద్ర, మల్లెల శామ్యూల్, సీవో యోబు, జ్యోతి, సంఘస్తులు పాల్గొన్నారు.

వార్డులలో కమిషనర్ పర్యటన

బాపట్ల, జూలై 20 : గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ శనివారం వార్డులలో పర్యటించారు. వివేకానందకాలనీలోని 9వ సచివాలయం సిబ్బందితో కలిసి పార్క్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని, పార్క్‌లో మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నక్కలవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

కర్లపాలెం, జూలై 20 : మండలంలోని పెదగొల్లపాలెం పంచాయతీ నక్కలవారిపాలెంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చేతుల మీదగా దివంగత నందమూరి తారకరామారావు విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, మండల నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం...

పిట్టలవానిపాలెం, జూలై 20 : పిట్టలవానిపాలెం ఐలెండ్ కూడలి సెంటర్ లో మంతెనవారిపాలెం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువకెరటాలు, పిట్టలవానిపాలెం మండలం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ఆనందరాజు యశ్వంత్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

బాపట్ల, జూలై 20 : గురుపౌర్ణమి సందర్భంగా భావపురి బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో శనివారం రైలుపేట రెల్లీకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమైక్య అధ్యక్షుడు శ్రీహరిప్రకాష్ నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అదేవిధంగా విజయలక్ష్మీపురంలోని శ్రీసీతారామ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులకు, మరుప్రోలువారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 60 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య కార్యవర్గ సభ్యులు సోమరాజు శ్రీనివాస్, కొలను మోహను, శ్రీకాంత్, రామారావు, హనుమంతరావు, శ్రీరామశర్మ, షణ్ముఖ, గూడాభట్టు శర్మ, శ్రీరామచంద్రమూర్తి, రాంగోపాల్, సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22 నుంచి పాఠశాలలో శిక్షసప్తాహ్

బాపట్లరూరల్, జూలై 20 : జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టిన 4వ వార్షికోత్సవం సందర్భంగా జూలై 22 నుంచి 29వ తేదీ వరకు అన్ని పాఠశాలలో శిక్షసప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని సమగ్రశిక్ష బాపట్ల అదనపు పథక సంచాలకులు ఎం.వెంకటసుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇంటి ముందు ఆక్రమణ తొలగించాలని వినతి

కొల్లూరు, జూలై 20 : ఇంటి ముందు ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని ఆక్రమించి హోటల్ నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్న మహిళపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలు తొలగించాలని గాంధీనగర్ వాసులు అధికారులకు వినతులు అందజేశారు. శనివారం కొల్లూరు గాంధీనగర్‌కు చెందిన సింగంశెట్టి చెంచుకృష్ణయ్య మరికొందరు తహసీల్దార్‌ను కలిసి తమ ఇంటి ముందు ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు స్థలాన్ని చల్లంచర్ల కనకదుర్గ అనే మహిళ ఆక్రమించి హోటల్ నిర్వహణ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుందని, దీని వల్ల తమతో పాటు కాలనీ వాసులకు కూడా ఇబ్బందికరంగా ఉందన్నారు. అదేమని ప్రశ్నిస్తే రాజకీయ నాయకుల అండదండలతో తమను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

తొలి దశలో గుర్తిస్తే కుష్టు వ్యాధి నయం చేయవచ్చు

రేపల్లె, జూలై 20 : కుష్టువ్యాధిని తొలుతలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయ్యవచ్చని డాక్టర్ నాగార్జున అన్నారు. కూచినపూడిలో ఇంటింటి సర్వే కుష్టు వ్యాధిపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై నొప్పిలేని బొడుపులు, కనుబొమ్మలు, కనురెప్పలపై వెంట్రుకలు రాలిపోతుండటంవంటి లక్షణాలు కనబడితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లవి, సిబ్బంది విజయ సుశీల, మురళి, మాధవి, సాంబశివరావు పాల్గొన్నారు.

పెదపులివర్రు బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో చోరీకి యత్నం

● యువకులను పట్టుకున్న స్థానికులు.. పోలీసులకు అప్పగింత



యువకుడిని, ఆటోను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

భట్టిప్రోలు, జూలై 20 : ప్రభుత్వ కార్యాలయంలో దొంగతనం చేసేందుకు వచ్చిన యువకులను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని పెదపులివర్రులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలికి చెందిన నలుగురు యువకులు ఆటోలో మండలంలోని పెదపులివర్రు గ్రామానికి వచ్చారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలోకి చొరబడిన యువకులను స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు పరారయ్యారు. ఒక యువకుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువకుడిని, ఆటోను స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఆటోలో గోతాలు, ఇనుపకడ్డీలు ఉన్నాయని, కార్యాలయంలోకి ఎందుకు వెళ్ళారు అనే విషయంపై వేమూరు సీఐ పి.రామకృష్ణ పర్యవేక్షణలో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తాళాలు ఎక్కడ ఉన్నాయో దొంగతనానికి వచ్చిన వాళ్ళకు ఎలా తెలిసింది, నేరుగా తాళాలు తీసుకుని వెళ్ళడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పిట్టువారిపాలెం టీమ్‌కు విజయం

కర్లపాలెం, జూలై 20 : మండలంలోని కొత్తనందాయపాలెం పెట్రోల్ బంకు గ్రౌండ్‌లో శనివారం పిట్టువారిపాలెం, శీలంవారిపాలెంలకు క్రికెట్ పోటీలు జరగగా పిట్టువారిపాలెం విజయం సాధించి నాల్గొవ స్థానంలో నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. గెలిచిన టీమ్‌కు మ్యాన్ ఆఫ్ మ్యాచ్‌ను ఆట్లబాలశంకర్‌రెడ్డి స్పాన్సర్ చేశారు. 5వ స్థానంలో శీలంవారిపాలెం టీమ్ నిలిచిందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకి బాపట్ల టీమ్, 11 యంగ్ టైగర్స్ మ్యాచ్ జరగనుందని వీరిలో విజయం సాధించిన వారు అన్ని మ్యాచ్‌లు గెలిచిన ఎంవిరాజుపాలెం టీమ్‌తో ఫైనల్‌లో తలపడనున్నారన్నారు.

పారదర్శకతకు నిదర్శనం సమాచార హక్కు చట్టం

రేపల్లె, జూలై 20 : సమాచార హక్కు చట్టం పారదర్శకతకు నిదర్శనమని జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమాచారహక్కుచట్టంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైన సమాచారం కోరితే దరఖాస్తున్న చేసుకున్న 30 రోజులలోపు అందించాలని, లేనిపక్షంలో ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి, ఈవోపీఆర్డీ మల్లికార్జున్‌రావు, ఏవో విజయబాబు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, జూలై 20 : పాలనలో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావటానికి ప్రభుత్వం యంత్రాంగం వద్ద ఉన్న సమాచారాన్ని పొందటానికి దేశపౌరులకి సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ అన్నారు. కర్లపాలెం మండలపరిషత్ కార్యాలయంలో సమాచార హక్కుచట్టంపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నిర్మలానందాబాబా, ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఆట్ల బాలాజీరెడ్డిలు సమాచార హక్కు చట్టంలో ఉండే సెక్షన్‌లు గురించి విపులంగా చర్చించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజి, ఎంపీపీ యారం వనజ, ఎఫ్‌డివో రమేష్, మండల పశువైద్యాధికారి రేచల్ దివ్య, ఎంఇవో విజయశ్రీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్లరూరల్, జూలై 20 : ప్రజలు సమాచార హక్కుచట్టం 2005పై ప్రజలు అవగాహన కలిగియుండాలని ఎంఇవో ఎస్.నిరంజన్ అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సమాచారహక్కుచట్టంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ అధ్యక్షులు హరిబాబు, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలి : ఏఈ

పిట్టలవానిపాలెం, జూలై 20 : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ప్రజలు విద్యుత్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్‌శాఖాధికారి కె.చంద్రశేఖర్ తెలిపారు. తడిచిన కరెంటు విద్యుత్ స్తంభాలను ముట్టుకోరాదని, విద్యుత్‌లైన్‌లు తగులుగుతున్న చెట్లను అంటుకోరాదని, విద్యుత్‌లైన్‌లకు చెట్టుకొమ్మలు తగిలితే విద్యుత్‌శాఖాధికారులకు తెలియజేయాలన్నారు. స్విచ్‌బోర్డులను తడిచేతులతో పట్టుకోవద్దని, గృహాల బయటపెట్టిన లైట్లను తడవకుండా చూసుకోవాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు మోటార్లు, కంప్యూటర్ స్విచ్‌లను తక్షణమే ఆపివేయాలని ఏఈ తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

భట్టిప్రోలు, జూలై 20 : కృష్ణానదికి వరద వస్తే ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రేపల్లె ఆర్డీవో హేలా షారోను అన్నారు. మండలంలోని ఓలేరు పల్లెపాలెం, పెదలంక కాకులడొంక గ్రామాల్లో కృష్ణానది వద్ద పరిస్థితిని పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని క్యూసెక్కుల నీరు వస్తే ఎక్కడి వరకు ముంపు జరుగుతుందని, విపత్తు వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలని అంశాలపై సమీక్షించి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో శాఖల వారీగా వివరాలు సేకరించారు. నదిలోకి మనుషులు, పశువులు వెళ్ళకుండా చూడాలని, కల్వర్టులు దాటి వెళ్ళేందుకు ప్రయత్నం చేయవద్దని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో నదీ పరివాహక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను, పశు సంపదను మెరక ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయి అని అడుగగా వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూలు, విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూలు, స్థానిక టీఎంరావ్ హైస్కూలు ఉన్నాయని అధికారులు తెలియజేశారు. పోలీసు, రెవెన్యూ, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హేలా షారోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెదలంక కాకులడొంకలో అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో షారోను

తగ్గిన వర్షం ఊపిరిపీల్చుకుంటున్నరైతన్నలు

రేపల్లె, జూలై 20 : తీరప్రాంతంలో గత నాలుగురోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురవటంతో పంట పొలాల్లో నీరు నిలిచి రైతన్నలు నానా ఇబ్బందులు పడ్డారు. శనివారం వర్షం తగ్గటంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. రెండు, మూడు రోజులపాటు వర్షం లేకుండా ఉంటే వెదపెట్టిన పొలాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండదంటూ రైతులు తెలుపుతున్నారు. నాలుగురోజుల క్రిందట వేసిన వెద పొలాల్లో విత్తనాలు అన్ని ఒక్క చోటకు చేరి రైతులు నష్టపోయారని, తిరిగి మరలా విత్తనాలు చల్లుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే పది వేల ఎకరాలపైనే వెద వ్యవసాయం చేశారని దాంట్లో మూడువేల ఎకరాలకుపైనే మొలకలు రాగా విత్తనాలన్నీ ఒక్క చోటకు చేరటంతో నష్టపోయిన పరిస్థితి నెలకొందన్నారు. విత్తనాలకు సుమారు రూ.3 వేల నుంచి రూ.4 వేలు పెట్టుబడి పెట్టామని, ఆ పెట్టుబడంతా నీటిలో కలిసిపోయిందంటూ రైతులు వాపోతున్నారు. వర్షం తగ్గితే రైతులకు కొంత మేలు జరుగుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పి.వెంకటేశ్వర్లు

రేపల్లె, జూలై 20 : ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి పి.వెంకటేశ్వర్లు అన్నా రు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ, గుంటూరు జిల్లా న్యాయసేవాధికారసంస్థ అదేశాల మేరకు రేపల్లె మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించటం, దాని ఆవశ్యకత, ఉపయోగాల గురించి శనివారం స్థానిక కోర్టులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన వెంకటగోపాలరావు, న్యాయవాదులు అళ్ళ సూరిబాబు, పారా లీగల్ వలంటీర్ ఆర్.శ్రీనివాసరావు, చెన్ను నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

అమృతలూరు, జూలై 20 : మండలంలోని పెదపూడిలో 288 మంది పేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తుమ్మల రామచంద్రరావు 32వ వర్ధంతి, నాగరత్తమ్మ 28వ వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు శివరామమోహనరావు ఆర్థిక సహకారంతో పేదలకు దుస్తులతోపాటు, సబ్బు, ఖర్జూరపండు ఒక కేజీ, చేతి సంచి అందించారు. ఈ సందర్భంగా దాతకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డపనేని సుధీర్, గోగినేని కల్కిమూర్తి, కరుణశ్రీ, ఎం.ఆనంద్, జాస్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వెదనాటిన వరిలో జాగ్రత్తలు పాటించాలి

అమృతలూరు, జూలై 20 : మూడు రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాల కారణంగా వెద నాటిన వరిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లోకేశ్వరి సూచించారు. శనివారం ఆమె మండల పరిధిలోని పెదపూడి గ్రామంలో వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ బాపట్ల ఏరువాక కో ఆర్డినేటర్ బాలమురళీధర్ సూచనల మేరకు పంట పొలాలను పరిశీలించడం జరిగిందన్నారు. మొలక రాని పొలాల్లో నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలన్నారు. అనంతరం ఎకరాకు ఒక బస్తా డీఏపీ, 25 కిలోలు యూరియా, 20 కిలోలు పోటాష్ చొప్పున చల్లాలని రైతులకు తెలిపారు. ఆమె వెంట ఏఈవో శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

ఘనంగా షిర్డీ సాయిబాబా శోభాయాత్ర

భట్టిప్రోలు, జూలై 20 : శ్రీ సాయినాధ దత్తాత్రేయస్వామి గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా శనివారం సాయిబాబా వారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. బాబా వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపైకి చేర్చి సుందరంగా అలంకరించి స్థానిక దేవాలయం వద్ద నుంచి భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామ పురవీధులలో బాబా నామస్మరణ గావిస్తూ భక్తులు జోలె పట్టి భిక్షాటనలో పాల్గొన్నారు. దారి పొడవునా భక్తులు తమ శక్తి కొలది విరాళాలను సమర్పించుకుని తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవాలలో భాగంగా గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం సుప్రభాత సేవ, కాకడ హారతి, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు, దంపతులతో విశేష పూజలు, మధ్యాహ్నం హారతి అనంతరం దేవస్థానం ఆవరణలో నారాయణ సేవ అన్న ప్రసాద వినియోగం జరుగుతుందని మందిర కమిటీ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. ఉత్సవాలను సాయిబాబా మందిర కమిటి సభ్యులు పర్యవేక్షణ చేస్తున్నారు.

గ్రామసేవల అభివృద్ధికి ప్రతి అధికారి కృషి చేయాలి

చెరుకుపల్లి, జూలై 20 : గ్రామసేవల అభివృద్ధికి ప్రతి అధికారి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపీపీ మత్తి దివాకరరత్నప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజలకు తాగునీరు, పరిసరాల అభివృద్ధిని చేయాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. గ్రామాలలోని ప్రజలు ఇబ్బందులు పడితే అధికారులపై చర్యలు తీసుకోవటం తప్పదని హెచ్చరించారు. పలు గ్రామాల్లో తాగునీరు, వీధి దీపాలు వెలగటం లేదని అధికారులకు తెలిపారు. వర్షాలు పడటం వల్ల రహదారులపై మురుగునీటినిల్వలు ఏర్పడుతున్నాయని, వాటిని తొలగించి వెంటనే బ్లీచింగ్, సున్నం చల్లించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీసాయికృష్ణ బృందావనం ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

పిట్టలవానిపాలెం, జూలై 20 : పిట్టలవానిపాలెం గ్రామంలో ఉన్న శ్రీసాయికృష్ణ బృందావనం ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో శ్రీషిరిడిసాయిబాబా వారి గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయిబాబా వారికి అష్టైశ్వర్య పూజ కార్యక్రమాలు, హోమాలు, వివిధపూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం 12 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వాగులో చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు

రూ.37.300లక్షలతో నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పర్చూరు, జూలై 20 : వాగును కమ్మేసిన చిల్లచెట్లు శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తపై అధికారులు స్పందించారు. చిల్ల చెట్లను తొలగించేందుకు రూ.37.300లక్షల అంచనాలతో శనివారం నివేదిక పంపినట్లు డ్రైనేజ్ స బ్ డివిజన్ సహాయ కార్యనిర్వాహక అధికారి తెలి పారు. పర్చూరు వాగులో చిల్లచెట్లు ముళ్లపొదలు పెరిగి పోయి అడవిని తలపిస్తున్నాయి. కొద్దిపాటి వరదలు వచ్చినా సమీపంలోని వేల ఎకరాల్లో పంట భూములు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు ఏళ్ల తరబడి వాగును అభివృద్ధి చేయకపోవడంవల్ల నీటి ప్రవా హం లేక అధ్వానంగా తయారైంది. అదే వా గులో నీటిని ఆయా గ్రామాల ప్రజలు మంచినీటి చెరువు లకు నింపుకుంటున్నారు. ఈతరుణంలో వాగు పరిస్థితిపై శుక్రవారం వార్త వచ్చింది.

వసతి గృహాలు లేక విద్యార్థినుల ఇక్కట్లు

» అద్దె భవనంలో కొనసాగుతుందని ఎనిదేళ్ల కిందట రద్దు

» మంత్రులపైనే ఆశలు

అద్దంకి, జూలై 20 : దళితుల సంక్షేమం కోసం ప్ర భుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కొన్ని చిన్న విషయాలలో నిర్లక్ష్యం కారణంగా ఫలాలు అంద ని పరిస్థితి నెలకొంది. అద్దంకి నియోజకవర్గంలో ఎస్సీ జనాభా ఎక్కువ గానే ఉంది. నియోజకవర్గం మొత్త మ్మీద కనీసం ఒక్క బాలికల వసతి గృహం కూడా లేక పోవడం దురదృష్టమనే చెప్పాలి. నియోజకవర్గంలో 8 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఉండగా, వాటిలో అద్దంకి పట్టణంలో రెండు బాలుర, ఒకటి కళాశాల బాలురు, ఒకటి కళాశాల బాలికల వసతి గృహాలు, పమిడిపాడు, ముప్పవరం, వైదన, సంతమాగులూరు లలో బాలుర వసతిగృహాలు ఉన్నాయి. అద్దంకి పట్ట ణంలో దశాబ్దాల నుంచి ఉన్న సాంఘిక సంక్షేమ బాలి కల వసతి గృహం అద్దె భవనంలో నడుస్తుందన్న కార ణంతో 8ఏళ్ల కిందట రద్దు చేశారు. అప్పట్లో 140 మంది విద్యార్థినులు పోతురాజుగండి వద్ద ఉన్న అద్దె భవ నంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం లో ఉన్నారు. అప్పట్లో రద్దు చేయడంతో విద్యార్థినుల పరిస్థితి అగమ్యగోచరంగా మారి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పటి నుంచి మరలా బాలికల వసతి గృహం ఏర్పాటు చేయలేదు. దీంతో నియోజకవర్గంలో ఉన్న విద్యార్థినులు దూరప్రాంతా లకు వెళ్లాల్సిరావడంతో ఇబ్బంది పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు దూరప్రాంతాలకు పంపించలేక అర్థాంతరంగా చదువులు మానివేస్తున్నట్లు కూడా తెలుస్తుంది. బల్లికురవ మండలంలో ఒకే ఒక హాస్టల్ వైదనలో ఉంది. అదీ కూడా పూర్తిగా శిథిలావస్థకు చేర డంతో విద్యార్థినులు చేరక ఈ ఏడాది మూత పడింది. దాని స్థానంలో మండల కేంద్రమైన బల్లికురవలో సాం ఘిక సంక్షేమ బాలుర లేదా బాలికల వసతి గృహం ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రా యం ఉంది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న అద్దంకిలో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని పున రుద్ధరించడం ద్వారా ఉపయోగమని తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అద్దంకి పట్టణంలో ఎస్సీ బాలుర వసతి గృహాలు రెండు సొంత భవనాలలో నడుస్తున్నాయి. వాటిలో ఒక దానిని అద్దె భవనంలోకి మార్చి బాలికల వసతిగృహానికి కేటాయించాలని, అలా కాని పక్షంలో అద్దె భవనంలోనైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామి ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాది నుంచే అద్దంకి, బల్లికురవలో సాంఘిక బాలికల వసతిగృహాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పలు వురు ఎస్సీ బాలికలు, తల్లిదండ్రులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



మెప్మా సీఎంఎం ఫణికుమారి, ఆర్‌పీలను విచారిస్తున్న ఆర్డీవో

విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మహిళా మార్ట్ నిధుల దుర్వినియోగంపై ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూలై 20 : మహిళా మార్ట్ నిధులు దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. అద్దంకిలోని జగనన్న మహిళామార్ట్ నిధులు దుర్వినియోగంపై ఆంధ్రజ్యోతిలో పలు మార్లు కథనాలు ప్రచురితం కావడం, మెప్మా సభ్యులు ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫిర్యాదు చేయడం తో శనివారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, ఇతర అధికారులతో కలిసి స్థానిక మెప్మా కార్యాలయం లో విచారణ చేశారు. ఈ సందర్భంగా మహిళా మార్ట్ పెట్టుబడి, నిర్వహణ ఇతర అంశాలతో పాటు అవినీతి ఆరోపణలపై మెప్మా సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మార్ట్ నిర్వహణపై సీఎంఎం ఫణికు మారి జమా, ఖర్చులు వివరించగా, అందులో చోటు చేసుకున్న పలు అవకతవకలను పలువురు ఆర్‌పీలు ఆర్డీవో దృష్టికి తీసుకు వచ్చారు. మహిళా మార్ట్ మూసివేసే సమయంలో ఉన్న స్టాకు కంటే అనంతరం బ్యాంక్ ఖాతా లోకి అదనంగా డబ్బులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మరోసారి పూర్తి స్థాయి విచారణ చేపడతామని, రికార్డులు అందుబాటులో ఉంచాఅన్నారు. అవకతవకలు రుజువైతే బాధ్యులపై చర్యలు తప్పవని ఆర్డీవో హెచ్చరించారు. మునిపల్ కమిషనర్ సత్యనారాయణ, డీసీవో శ్యాంసన్ పాల్గొన్నారు.

పాఠశాలకు గ్యాస్ స్టౌవ్, వంట సామగ్రి వితరణ



గ్యాస్ పొయ్యిని అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 20 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శని వారం ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ స్టౌవ్, వంట సామగ్రిని అందజేశారు. కట్ట కిందపాలెం ప్రాథమిక పాఠశాలలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టంరాజు శ్రీరా మచంద్రమూర్తి ఆర్థిక సాయంతో స్టౌవ్, వంట పాత్రలను అందజేశారు. కార్య క్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్నిమురళికృష్ణ, మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రిజర్వ్ ఫారెస్ట్‌ను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నాగరాజుపల్లి ఫారెస్ట్ భూమి పరిశీలన

మార్టూరు, జూలై 20 : మండలంలోని నాగరాజుపల్లి పంచాయతీ పరిధిలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఎర్రమట్టిని తవ్విన వారిపై కేసులు పెడతామని, మట్టిని రవాణా చేయడానికి వచ్చిన వాహనాలను సీజ్ చేస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.ర మేష్ హెచ్చరించారు. శనివారం ఫారెస్ట్ అధికారులు నాగరాజుపల్లిలోని రిజర్వ్‌ఫారెస్ట్ ఏరియాను పరిశీలించారు. అక్కడ మట్టిని తరలించడానికి వచ్చిన వ్యక్తులకు ఈ రిజ ర్వ్‌ఫారెస్ట్‌లో మట్టిని తవ్వడానికి ఎవరికీ అనుమతి లేదని అధికారులు వారికి తెలి పారు. అటవీ శాఖ నిబంధనలు ప్రకారం అటవీ భూములలో మట్టి తవ్వకాలకు అను మతి లేదన్నారు. ఒక వేళ ఎవరైనా అటవీ నిబంధనలను అతిక్రమిస్తే రవాణా కోసం వచ్చే వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వేటపాలెం సెక్షన్ ఆఫీ సర్ వై.జాన్సన్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, హిదయతుల్లా పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోవాలి

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బ్యాంక్ మేనేజర్, ఉద్యోగులు

అద్దంకిటౌన్, జూలై 20 : అద్దంకి, ఇతర ప్రాంతాల ప్రజలు బ్యాంక్ ఆఫ్ బరోడా ద్వారా అందించే వివిధ రకాల పథకాలను, సేవలను వినియోగించుకోవాలని అద్దంకి బ్రాంచి మేనేజర్ ఏ.మురళీకృష్ణ అన్నారు. శనివారం బ్యాంక్ ఆఫ్ బరోడా 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ వ్యవస్థాప కుడు సాయాజీరావ్ గైక్వాడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని గురకాయపాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బ్యాంక్ మేనేజర్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

మేదరమెట్ల, జూలై 20 : గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో సమతావాణి ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగు ణంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఆరోగ్య శాఖ సహ కారంతో డయేరియా, ఇతర వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డేని పాటించి, ఎక్కడా చెత్తలు, మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్ర త్తలు పాటించాలన్నారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

మార్టూరు, జూలై 20 : ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 24 బుధవారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో జీ నితిన్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహిస్తారని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు.

అడుగంటిన అంబడిపూడి చెరువు

» ఆరు గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

» అవస్థలు పడుతున్న ప్రజలు



అంబడిపూడి చెరువులో అడుగంటిన నీరు

బల్లికురవ, జూలై 20 : మండలంలోని అంబడిపూడి రక్షిత నీటి పథకం స్టోరేజ్ చెరువులో నీరు అడుగంటింది. గత వారం రోజుల నుంచి ఈ చెరువు ద్వారా తాగు నీరు అందే ఆరు గ్రామాలకు పూర్తిస్థాయిలో నీటి విడుదల నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతు న్నారు. సాగర్ నీరు వచ్చే వరకూ తాగునీరు అందే పరిస్థితి లేదని తక్షణమే సాగర్ నీరు రాగానే చెరువును పూర్తి స్థాయిలో నింపాలని ప్రజలు కోరుతున్నారు. బల్లికురవ మండలం లోని పెద అంబడిపూడి గ్రామంలో ప్రభుత్వ సీపీడబ్ల్యూ పథకంలో పెద అంబడిపూడి, చినఅంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లి కురవ, నక్కబొక్కలపాడు గ్రామాలకు ఫ్లోరిన్ లేని శుద్ధి జలాన్ని అందించేలా ప్రభుత్వం రక్షిత మంచి నీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. ఈ పథకం పని చేయకుంటే గ్రామాలలో నీటి ఎద్దడి వస్తుంది. ప్రతి ఏటా ఈ చెరువును అధి కారులు ప్రణాళిక మేరకు నింపుతారు. ఈ ఏడాది మాత్రం అరకొరగా చెరువుకు నీటిని పెట్టడంతో ఇప్పుడు అది అడుగంటి పైపు లైన్ కు అందడంలేదు. దీంతో వారం నుంచి ఆరు గ్రామాలకు మంచి నీటి సరఫరా నిలిచిపో యింది. ప్రజలు నీరు అందక పొరుగు గ్రామా లకు పరుగులు పెడుతున్నారు. కొందరు ఆర్వో ప్లాంట్ల వద్దకు బారులు తీరుతున్నారు. ఆరు గ్రామాలకు నిరంతరం అందించే నీటి పథకం ఇప్పుడు పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ డ్యాం నుంచి మంచి నీటి అవసరాలకు కోసం నీటి విడుదల జరిగిందని అధికారులు వెంటనే అంబడిపూడి చెరువును పూర్తిస్థాయిలో నింపే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బడికెలా రావాలి..?

రాంనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మొర



మరో రోడ్డులో చిల్లచెట్లతో ఉన్న రోడ్డు



స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి

ఇంకొల్లు, జూలై 20 : సార్ మేము పాఠశాలకు ఎలా రావాలి.. చిన్న పాటి వర్షం పడితే రాలేకపోతున్నాం. రావాలంటే భయమేస్తుంది.. ఇదీ ఇంకొల్లులో కడవకుదురు కాలనీ సమీపంలోని రాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఆవేదన. ఈ పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో పెద్ద గుంతలు పడి చిన్నపాటి వానకే పిల్లలు బడికి పోలేని పరిస్థితి ఉంది. స్కూల్‌కు వెళ్లేందుకు మరో రోడ్డు ఉంటే అదేమో చిల్ల చెట్లతో మూసుకుపో యింది. గత వారం రోజులుగా కురు స్తున్న వర్షాలకు పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిలో కాలుతీసి కాలు పెట్టలేని పరిస్థితి. మరో రోడ్డులో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులు పెరిగిన చిల్ల చెట్లతో అడ్డంకులు పడుతున్నారు. ఈ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూల్‌కు వేళ్లేందుకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి సమ స్యను అధికారులు పట్టించుకొని ఆ చిన్నారులు ప్రశాంతంగా బడికి పోయేలా చర్యలు తీసుకోవాలి.

చినుకు పడితే.. మినీ బైపాస్ బురదే..!



బుదర మయంగా అద్దంకిలోని మినీ బైపాస్

అద్దంకిటౌన్, జూలై 20 : ఈ బుదర రోడ్డును చూసి ఇది ఏదో గ్రామం లోని, గ్రామాలకు వెళ్లే అడ్డ రోడ్డు అనుకుంటే పొరపాటే. అద్దంకి మున్సి పాలిటీలోని మినీ బైపాస్‌గా చెప్పుకునే కాలువ కట్ట రోడ్డు. చినుక పడితే ఆ రోడ్డు వరి నారు మడిని తలపిస్తుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం హయంలో ఆ రోడ్డుకు గ్రావెల్, కంకర వంటి వి పోసి అభివృద్ధి చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ రోడ్డు అభివృద్ధిని గాలికొదిలేసింది. దీంతో గ్రావెల్, కంకర వంటివి లేకుండా కుంటలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చినుక పడితే ఆ రోడ్డు అంతా బురద మయంగా మారి కనీసం పాదచారులు కూడా నడిచేందుకు వీలు లేకుండా మారింది. ఇప్పటికైనా సంబంధిత మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతి నిధులు దృష్టి పెట్టి మినీ బైపాస్‌గా పిలువడే ఈ కాలువ కట్ట రోడ్డును అభివృద్ధి చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానిక ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

నేడు గొనసపూడిలో ధనిక్ భారత్‌పై చర్చ

చినగంజాం, జూలై 20 : మండలంలోని గొనసపూడి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ధనిక్ భారత్ అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు ధనిక్ భారత్ మిషన్ నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలి పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విక్రం నారాయణరావు ఆధ్వర్యంలో చర్చావే దిక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అవినీతి, నల్లధనం తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. నిపుణులు, మేధావులు పాల్గొంటు న్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టోల్‌ప్లాజా కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

మార్టూరు, జూలై 20 : బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద పనిచేసున్న కాంట్రాక్టు ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం నిరసనకు దిగారు. వారికి మద్దతుగా సీఐటీయూ నాయకులు బత్తుల హనుమంతరావు, ఉద్యోగుల యూనియన్ నాయకుడు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్నా మన్నారు. నేటికీ తమకు జీతాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ ప్లాజా కంపెనీ పరిధిలో కాకుండా కాంట్రాక్టర్ పరిధిలో పనిచేస్తుండడంతో తమకు గుర్తింపు లేదని, సరైన వేతనాలు లేవని తెలిపారు. సమస్యలు పరి ష్కరించాలని అధికారులకు విన్నవించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా మని వారు హామీ ఇచ్చారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, జూలై 20 : వర్షాల కారణంగా పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వద్దని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. పురలపాలక సంఘ పరిధిలోని పలు డ్రైన్‌లు, చెత్త సేకరణ ప్రదేశా లను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచ నలు ఇచ్చారు. స్వర్ణ రోడ్డు, పోలేరమ్మ గుడి, గడియార స్తంభం, మసీదు సెంటర్, ముక్కోణం పార్క్, దండుబాట ప్రాంతాలను సుదీర్ఘంగా పరిశీలిం చారు. పురపాలక సంఘం పరిధిలో ఎక్కడా వర్షపు నిల్వలు, మురుగు నిల్వలు లేకుండా చూడాలన్నారు. మురుగు పారుదల ఉండేలా చూడాలన్నారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని వివరించారు. కమిషనర్‌తో పాటు శానిటేషన్, వార్డు, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

విద్యా వ్యవస్థకు కేంద్ర బిందువు విద్యార్థి

ఎమ్మెల్సీ లక్ష్మణరావు

పంగులూరు, జూలై 20 : విద్యార్థి లేకుండా విద్యా వ్యవస్థ లేదని, దానికి కేంద్ర బిందువు విద్యార్థి అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలలో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన వారితో పాటు 2023లో జరిగిన ఎన్ ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల అభినందన సభ శనివారం పంగులూరు ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థులు సమా జంలో అణచివేతకు గురైనవర్గాల వారని, ఉపాధ్యాయులు వారి పట్ల ఆప్యాయ తతో ఉండాలన్నారు. ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన విద్యార్థులకు కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సమకూర్చిన శంకరనారాయణ డిక్షనరీలతో పాటు రూ.1000 నగదును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు కె.నాగభూషణం, జీ.వీరాంజనేయులు, విశ్రాంత ప్రొఫెసర్ వీరనారాయణ, పాఠశాల హెచ్‌ఎంలు రమాదేవి, అణిత, బంగారుకొండ, గోవిందరాజులు, గిరిజ, హనుమంతరావు, వడ్డవల్లి వీరనారాయణ, మేటీఎఫ్ ప్రతినిధులు చెం చయ్య, శ్రీనివాసరావు, నరసింహారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నా రు. చందలూరు పాఠశాల విద్యార్థిని శ్రుతి యోగాసనాలు ఆకట్టుకున్నాయి.



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

సమాచార హక్కుతో జవాబుదారీతనం





బల్లికురవలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభద్ర... మార్టూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

బల్లికురవ, జూలై 20 : సమాజంలో ప్రజలకు ప్రభుత్వానికి సమాచార హక్కు చట్టం ద్వారా జావా బుదారీతనం పెరుగుతుందని తహసీల్దార్ సుభద్ర అన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి అధ్యక్షతన రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టంపై అవగా హన సదస్సు జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతు నిబంధనల మేరకు ఎవరైనా సమాచా రాన్ని పొందే వీలు ఉందన్నారు. ప్రజలకు అడిగిన సమాచారాన్ని సకాలంలో ఇవ్వకుంటే చర్యలు తప్ప వని సుభద్ర హెచ్చరించారు. సదస్సులో ఎంపీడీవో హనుమారెడ్డి, సీడీపీవో సుధ, ఈవోపీఆర్డీ సుమతి, ఏఈలు హనుమంతురావు, రామాంజనేయులు, కిషో ర్‌బాబు ఎంఈవో రమేష్, రిపోర్సు పర్సన్ అనిల్ పాల్గొన్నారు.

పంగులూరు : పౌరులు కోరిన సమాచారాన్ని 30 రోజులలోగా అందిచాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఎంపీ డీవో సమావేశ మందిరంలో శనివారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీరాజ్, రెవెన్యూ, వ్యవసాయ, వెలుగు, ఎన్‌ఆర్‌జీఎస్ అధికా రులు పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు) : సమాచార హక్కు చట్టంపై శనివారం కారంచేడు మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. సమాచార హక్కు చట్టం ఏవిధంగా ఉపయోగపడు తుందో ఏవో వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.సుశీలాదేవి, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏపీవో లక్ష్మీనారాయణ, విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.హిమబిందు, కె.సునీత పాల్గొన్నారు.

మార్టూరు : ప్రభుత్వ ఉద్యోగులు సమాచారహక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలని జిల్లా వ్యవ సాయ అధికారి వై.రామకృష్ణ అన్నా రు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమాచారహక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో వీరగంధం కిరణ్ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో రామ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల నుంచి పనులకు సంబంధించిన సమాచారాన్ని పొందే హ క్కు అంద రికీ ఉందన్నారు. కార్యక్రమంలో స హాయ వ్యవసాయ సంచాలకులు వి. శ్రీనివాసరావు, ఎంఈవో వస్రాంనా యక్, ఈవోపీఆర్డీ సు బ్బారావు, ఏపీఎం, కార్యదర్శులు పాల్గొన్నారు.

యద్దనపూడి : సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాచారం తెలుసు కునే హక్కు ప్రజలకు ఉందని సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహనరావు అన్నారు. శనివారం యద్దనపూడిలోని స్త్రీశక్తి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. వ్యవసాయఅధికారి సీహెచ్ ఆదినారా యణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, డీటీ మస్తానరావు, అధికారులు, వీఆ ర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఎంపీడీవో కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడారు. కార్య క్రమంలో వ్యవసాయాధికారి పోతినేని వేణుగోపాల్, ఎంఈవో శ్రీనివాసరావు, ఏపీవో రేణుక, ఏపీఎం మోహనరావు, ఏఎస్‌వో పుష్పలత, కార్యద ర్శులు, వీఆ ర్వోలు, అధికారులు పాల్గొన్నారు.

చినగంజాం : సమాచార హక్కు చట్టం పారదర్శక తకు నిదర్శనమని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.వేణుగోపా లకృష్ణమూర్తి, ఏవో కే.భాస్కరరావు అన్నారు. ఎంపీ డీవో సమావేశ హా లులో అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో 1, 2 బీ.అ జయ్‌బాబు, కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ దాసు, టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య, కార్య దర్శులు, అధికారులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థలన్నింటి కార్యాకల పాల గురించి తెలుసుకునే హక్కు పౌరులందరికీ ఉం దని ఎంపీడీవో సమతావాణి అన్నారు. శనివారం మం డల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా చార హక్కు చట్టం అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. అడిగిన సమాచారాన్ని నిర్దిష్ట సమయానికి తెలియజేయాలన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్ బి.సుశీల, సీడీపీవో కృష్ణకుమారి, ఎంఈవో పున్నయ్య, ఏవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ ఓబులేసు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.